ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల

జిల్లా వార్తలు

శుక్రవారం 7 ఫిబ్రవరి 2025

ఫరూక్ ఫస్ట్

- ఫైళ్ల పరిష్కారంలో గుర్తింపు
- 9వ స్థానంలో బీసీ జనార్దన్‌రెడ్డి
- మంత్రులకు సీఎం చంద్రబాబు ర్యాంకులు





నంద్యాల, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతోంది. దీంతో పాలన తీరుపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. ఇందులో భాగంగా మంత్రుల పనితీరుపై ఇటీవల సర్వే చేయించారు. వివిధ మార్గాల ద్వారా జరిగిన ఈ సర్వేలో గతేడాది డిసెంబరు వరకు ఫైళ్ల క్లియరెన్స్ ఆధారంగా మంత్రులకు ర్యాంకులు కేటాయించారు. ఈ ర్యాంకుల్లో జిల్లాకు చెందిన రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మొదటి స్థానంలో నిలవగా, మరో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి 9వ ర్యాంకు లభించింది. కర్నూలు జిల్లాకు చెందిన పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌కు 15వ ర్యాంకు దక్కింది. గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో ర్యాంకుల జాబితాను చదివి వినిపించడం చర్చనీయాంశంగా మారింది. గత ఏడాది జూలై నుంచి డిసెంబరు నెల వరకు (ఆరు నెలలు) తమ వద్దకు వచ్చిన వివిధ ఫైళ్లను పరిష్కరించడంలో మంత్రి పనితీరును గుర్తించి సీఎం చంద్రబాబు సదరు ర్యాంకులను ప్రకటించారు. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డిలు ఫైళ్ల పరిష్కారంలో వేగవంతగా చర్యలు తీసుకున్నట్లు చంద్రబాబు గుర్తించారు. ఫరూక్‌కు మొదటి స్థానం, బీసీ జనార్దన్ రెడ్డి పదో స్థానంలో నిలవడంపై చంద్రబాబు అభినందించారు.

19 నుంచి టీసీసీ పరీక్షలు

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 6: (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్షలు ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి గురువారం తెలిపారు. టైలరింగ్, డ్రాయింగ్ (లోయర్, హైయర్) పరీక్షలు గుర్తింపు పొందిన పరీక్ష కేంద్రాల్లో జరుగుతాయన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్లను డౌన్‌లోడు చేసుకుని హాజరు కావాలన్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు.



డీసీసీలో కలకలం

- కళావెంకటరావు భవన్ పేరిట ప్రైవేట్ సొసైటీ రిజిస్ట్రేషన్
- ఏపీసీసీ అనుమతి లేకుండా వ్యవహారం
- కబ్జా కుట్రలో భాగమే... నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహాయాదవ్
- ఈకేవైసీ కోసమే సొసైటీ... కర్నూలు అధ్యక్షుడు మురళీకృష్ణ
- డీసీసీ ఆస్తుల విలువ రూ.16 కోట్లు పైమాటే
- విచారణకు ఆదేశించిన ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

కర్నూలు/కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం కబ్జాకు కుట్ర చేశారా..? అధిష్ఠానం అనుమతులు లేకుండా కళా వెంకట్రావు భవన్ పేరిట ప్రైవేటు సొసైటీ రిజిస్ట్రేషన్ చేయడం వెనుక ఆంతర్యం ఏమిటీ..? జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మురళీకృష్ణ ఒక్కడే ఈ నిర్ణయం తీసుకున్నారా..? దీని వెనుక రాష్ట్ర నేతలు ఎవరైనా ఉన్నారా..? ప్రస్తుతం ఆ పార్టీలో ప్రధానంగా చర్చ జరుగుతోంది. 66 ఏళ్ల చరిత్ర కలిగిన కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం (కళా వెంకట్రావ్ భవన్) స్థలం విలువ రూ.16 కోట్లు పైమాటే. ఇప్పటి వరకు డీసీసీ పేరిట కార్యకలాపాలు సాగించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో చక్రం తిప్పిన నేతలు డీసీసీ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించారు. ఏ ఒక్కరు కూడా ప్రైవేటు సొసైటీ పేరిట మార్చేందుకు ప్రయత్నాలు చేయలేదు. ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ అధ్యక్షుడిగా ఏడుగురితో ప్రైవేటు సొసైటీ రిజిస్ట్రేషన్ చేయించడం ఆ పార్టీలో కల్లోలానికి కారణమైంది. దీనిపై విచారణ చేసిన నివేదిక ఇవ్వాలంటూ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశించారు. దీంతో ఆ పార్టీ నేతలు గురువారం కర్నూలు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ (కళా వెంకటరావ్ భవన్)కు 66 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ భవనం కేంద్రంగా పని చేసిన నాయకులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముగ్గురు ముఖ్యమంత్రులు అయ్యారు. కేంద్ర మంత్రులుగా పని చేశారు. అంతటి చరిత్ర కలిగిన కార్యాలయం కబ్జా వివాదంలో చిక్కుకోవడం చర్చనీయాంశంగా మారింది. నగరం నడిబొడ్డున చరిత్రాత్మక కొండారెడ్డి బురుజుకు అతిసమీపంలో దాదాపు 0.33 ఎకరాల్లో (33 సెంట్లు) కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం నిర్మాణం కోసం 1959 జూలై 16న అప్పటి ఏపీ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి పునాదిరాయి వేశారు. నాటి జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష్యుడు మద్దూరు సుబ్బారెడ్డి, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పోలాది రామయ్యలు ఎంతో కృషి చేశారు. ఈ భవనం నిర్మాణం కోసం మూడేళ్లు శ్రమించారు. 1962 ఫిబ్రవరి 6న నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ప్రారంభించారు. ఇద్దరు ముఖ్యమంత్రుల కృషి ఉంది. ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రులుగా పని చేసిన నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజీవయ్య, కోట్ల విజయభాస్కరరెడ్డిలు ఈ కార్యాలయం కేంద్రంగా రాజకీయంగా చక్రం తిప్పారు. 1950 నుంచి నేటి వరకు 17 మంది జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా పని చేశారు.

కబ్జా చేసేందుకు ఎత్తుగడ

టూటౌన్ పోలీసులకు నేతల ఫిర్యాదు

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆస్తులను డీసీసీ పి.మురళీకృష్ణ కబ్జా చేసేందుకు ఎత్తుగడ వేశాడని ఏఐసీసీ సభ్యులు, నంద్యాల డీసీసీ అధ్యక్షులు జె.లక్ష్మి నరసింహయాదవ్ ధ్వజమెత్తారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ డీసీసీ కె.బాబురావు, నగర అధ్యక్షుడు జిలానీ బాషా, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.బ్రతుకన్న, సీనియర్ నాయకులతో కలిసి అత్యవసర సమావేశం నిర్వహించారు. అనంతరం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళా వెంకట్రావ్ భవన్ పేరుతో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఓ సొసైటీని ఏర్పాటు చేసి ఆస్తులకు తానే యజమానిగా సృష్టించుకునేందుకు కుట్రలు పన్నారని ఆరోపించారు. ఆ సొసైటీలో కూడా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పని చేసే గుమాస్తాలు, స్వీపర్లను సభ్యులుగా చేర్చడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్ర, జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలుకు తెలియకుండా, కనీసం ఒక సమావేశం కూడా ఏర్పాటు చేయకుండా సొంత నిర్ణయాలు తీసుకోవడంతో కుట్ర కోణం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఉమ్మడి జిల్లాల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలకు సంబంధించిన ఆదాయ వనరులను రాష్ట్ర పీసీసీ ఖాతాలో జమ చేయాలని ఆదేశించారన్నారు. గత 70 సంవత్సరాలుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి సంబంధించి ఆదాయాలను కాంగ్రెస్ పార్టీ అవసరాలకు మాత్రమే ఉపయోగించే వారని, జిల్లా కాంగ్రెస్ కార్యాలయానికి 15 వాణిజ్య సముదాయాలు ఉండగా వాటి ద్వారా నెల వారి రూ.1.87 లక్షల ఆదాయం సమకూరుతోందన్నారు. వాటిని కూడా సొంత అవసరాలకు వాడుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రెండు రోజులగా పీసీసీ ఆదేశాల మేరకు పి.మురళీకృష్ణ చేసిన అక్రమాలపై విచారణ జరిపిన అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అక్రమ సొసైటీని రద్దు చేయాలని రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీకి కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. ఇదేవిషయంపై డీసీసీ మురళీకృష్ణను సమావేశానికి ఆహ్వానించగా ఆయన వచ్చేందుకు నిరాకరించాడన్నారు. మాజీ డీసీసీ కె.బాబు రావు మాట్లాడుతూ డీసీసీ పదవిలో కూర్చున పి.మురళీకృష్ణ దళితుల పరువు తీశాడని మండిపడ్డారు. జిల్లా కేంద్రలో ఉన్న తమ కళ్లు గప్పి అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు జిలానీ బాషా, నాయకులు అనంతర్నం మాదిగ, ముర్షిద్‌పీర్ ఖాద్రీ, రియాజ్, రజాక్ వలి, పఠాన్ ఖాన్, విశ్వేశ్వర రెడ్డి, చెన్నయ్య, సదానందం, వెంకటరెడ్డి, లాజరస్ తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ పార్టీ నాయకులు

మిగతా 7వ పేజీలో

సంక్షోభంలో నాపరాళ్ల పరిశ్రమ



- భారీగా పెరిగిన ఖర్చులు - పడిపోయిన ధరలు
- మూతపడుతున్న నాపరాళ్ల పాలిషింగ్ యూనిట్లు..
- టైల్స్, మార్బుల్స్ దెబ్బకు కుదేలవుతున్న పరిశ్రమ
- పీకల్లోతు కష్టాల్లో కార్మికులు, యజమానులు
- లక్షలాది మంది కార్మికుల్లో ఆందోళన

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన నాపరాళ్ల పరిశ్రమ ప్రస్తుతం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ఒకప్పుడు ఇండ్ల నిర్మాణంలో నాపరాయి ప్రధానంగా వాడేవారు. కానీ మారిన పరిస్థితుల్లో వివిధ రకాల బ్రిక్స్, టైల్స్, మార్బుల్స్ విరివిగా వినియోగంలోకి వచ్చాయి. నాపరాళ్ల పరిశ్రమ కుదేలైంది. కుటీర పరిశ్రమగా పేరొందిన నాపరాళ్లకు గత కొన్నేళ్లగా మార్కెట్లో డిమాండ్ లేకపోవడంతో నాపరాయి పాలిషింగ్ యూనిట్లు వరుసగా మూతబడుతున్నాయి. ఈ పరిశ్రమ ఆధారంగా జీవిస్తున్న కార్మికులు రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. గత 20 ఏళ్ల క్రితం ఉమ్మడి కర్నూలు జిల్లాలో లభించే నాపరాళ్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఒడిస్సా, కేరళ తదితర రాష్ట్రాలకు పెద్ద ఎత్తున తరలిపోయేవి. ప్రతి రోజు సుమారు 500 లారీల నాపరాళ్లు బయటి ప్రాంతాలకు తరలించేవారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పరిశ్రమలు ఇలా: ఉమ్మడి జిల్లాలో విస్తారంగా నాపరాతి నిక్షేపాలు నెలకొని ఉన్నాయి. 1970 హెక్టార్లలో లీజులు పొందిన గనులు ఉండగా, సుమారు 800 వరకు నాపరాయి పాలిషింగ్ యూనిట్లు నెలకొని ఉన్నాయి. ఇందులో అత్యధికంగా బనగానపల్లె, కొలిమిగుండ్ల, అవుకు, బేతంచర్ల మండలాల్లోనే ఉండటం గమనార్హం. మరో వైపు బనగానపల్లె నియోజకవర్గంలో లభించే నాపరాళ్ల(ముడి ఖనిజం) ఆధారంగా అనంతపురం జిల్లా తాడిపత్రిలో వందలాది నాపరాయి పాలిషింగ్ యూనిట్లు వెలిశాయి. నాపరాయి పరిశ్రమే ఆధారంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో లక్షలాది మంది కార్మికులు జీవిస్తున్నారు.

డిమాండ్ లేక..

గనుల్లో నాపరాళ్లను వెలికితీసే ప్రక్రియలో యజమానులకు భారీగా ఖర్చులు పెరిగాయి. ఖర్చులకు అనుగుణంగా నాపరాయికి డిమాండ్ లేకపోవడం పరిశ్రమ దెబ్బతింటోంది. గత 20 ఏళ్ల క్రితం చదరం(100అడుగులు) నాపరాళ్లను వెలికి తీయడానికి రూ.100 నుండి 150 వరకు ఖర్చు వచ్చేది. మార్కెట్లో రూ.400, నుండి 500 వరకు విక్రయించేవారు. అయితే ప్రస్తుతం చదరం నాపరాళ్లను వెలికి తీయడానికి రూ.400 పైగా ఖర్చు అవుతుండగా మార్కెట్లో ధర మాత్రం రూ.500 నుండి 600 మించడం లేదు. మరో వైపు నాపరాయికి డిమాండ్ లేకపోవడంతో గనులు, పాలిషింగ్ యూనిట్లలో నిల్వలు పేరుకుపోతున్నాయి. ఇప్పటికే దాదాపు పావలా వంతు నాపరాయి పాలిషింగ్ యూనిట్లు మూతపడగా, ఈ సంఖ్య రోజు రోజుకూ పెరుగుతూనే వుంది. దీంతో ఇటు పరిశ్రమ వర్గాలు, కార్మిక వర్గాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

పెరుగుతున్న టైల్స్, మార్బుల్స్ వాడకం

రంగు రంగుల టైల్స్, మార్బుల్స్, గ్రానైట్స్ కలర్ ఫుల్‌గా మార్కెట్లో అతి తక్కువ ధరకు దొరుకుతున్నాయి. వినియోగదారులు వాటిపై ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో నాపరాళ్లు వినియోగించే వాళ్లు తగ్గి పోయారు. దీంతో నాపరాళ్ల పరిశ్రమకు కోలుకోలేని దెబ్బ తగిలింది. భవిష్యత్తులో నాపరాయి పరిశ్రమ కనుమరుగు అవుతుందా? అనే సందేహం నెలకొంది.



మూత పడటంతో నిలిచి పోయిన పాలిష్ పరిశ్రమ

రోడ్లున పడుతున్న కార్మికులు: నాపరాళ్ల పరిశ్రమ పీకల్లోతు నష్టాల్లో కూరుకపోతుండటంతో యజమానులు పరిశ్రమలను మూతవేసి, వేరే వ్యాపారాలపై దృష్టి పెట్టారు. దీంతో పరిశ్రమపై ఉమ్మడి జిల్లాలో ఆధారపడిన సుమారు లక్ష మందికి పైగా కార్మికులు, పరోక్షంగా ఆధారపడిన మరింత మంది రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది.

ఆటంకంగా మారుతున్న నిబంధనలు

మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు గత ప్రభుత్వం తెచ్చిన నిబంధనలు పరిశ్రమకు ఆటంకంగా మారాయి. ఒక హెక్టారుకు రూ.52 వేలు ఉన్న ఏడీఆర్(అడ్వాన్స్ డెడ్ రెంట్)కు ప్రీమియం అమౌంట్ కింద 10 రెట్లు (రూ.5.20లక్షలు) చెల్లించేలా నిబంధన తీసుకవచ్చారు. హెక్టారుకు రూ.52 వేలుగా ఉన్న ఎస్‌డీ (సెక్యూరిటీ డిపాజిట్) మూడింతలు(రూ.1.56లక్షలు) పెంచారు. గత ప్రభుత్వం తెచ్చిన కన్సిడరేషన్ ఫీజు వసూలు చేయాలని ఇటీవల కూటమి ప్రభుత్వం ప్రయత్నించింది. అయితే పరిశ్రమ వర్గాల నుండి తీవ్ర వ్యతిరేకత రావడంతో ఉపసంహరించుకుంది. గత ప్రభుత్వ నిబంధనలు సైతం తొలగించి, పరిశ్రమను ఆదుకోవాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి.

పనులు దొరకడం లేదు

నాపరాళ్ల పరిశ్రమలు మూతపడటంతో పనులు దొరకడం లేదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే కార్మికులకు పూట గడవడం కష్టం. మా కుటుంబాలు రోడ్డున పడక తప్పదు.

-భూపాల్ - మీర్జాపురం, ట్రాక్టర్ డ్రైవర్

డిమాండ్ లేదు



నాపరాళ్లకు డిమాండ్ పడిపోయింది. కొనేవారు కరువయ్యారు. గనుల్లో సరుకు నిలిచి పోతోంది. ఒకవేళ బలవంతంగా ఫ్యాక్టరీ వాళ్లకు విక్రయిస్తే డబ్బులు రావడంలేదు.

-బాబు, కొలిమిగుండ్ల, గని యజమాని

ఏం చేయాలో తోచడం లేదు



నాపరాయి పాలిషింగ్ యూనిట్లు మూతపడుతున్నాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టడంతో ఎంచేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నాం.

-పెద్దిరెడ్డి, నాపరాయి పాలిషింగ్ యూనిట్ యజమాని, కనకాద్రిపల్లె

ఏసీబీ కేసులో ఏఓ సువర్ణ కుమారి ఆస్తులు అటాచ్డ్

నంద్యాల, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): గతంలో నంద్యాల రవాణాశాఖ కార్యాలయంలో ఏవో (అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్)గా పనిచేసిన కుంపటి సువర్ణ కుమారి ఆస్తులను అటాచ్ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదాయానికి మించిన ఆస్తుల అభియోగాల నేపథ్యంలో ఏసీబీ అధికారులు 2023 డిసెంబరులో కర్నూలులోని ఆమె ఇంటితో పాటు బంధువుల ఇళ్లలో ఏకకాలంలో దాడులు చేశారు. ఈ దాడుల్లో రూ.1,10,18,663 మేర ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. విచారణ అనంతరం ఉన్నతాధికారులు ఆమెను సస్పెండ్ చేశారు. తాజాగా గురువారం ఈ కేసులో భాగంగా ఆమె ఆస్తులను అటాచ్ చేయడంతో పాటు ఏసీబీ కోర్టులో ఫైల్ చేయాలని అవినీతి నిరోధక శాఖను (ఏసీబీ) ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం

యాగంటి ఆలయ ఈఓ చంద్రుడు

బనగానపల్లె ,ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): యాగంటి శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆలయ ఈఓ చంద్రుడు పిలుపునిచ్చారు. గురువారం బనగానపల్లె పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో యాగంటి బ్రహ్మోత్సవాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ చంద్రుడు మాట్లాడుతూ ఈ ఏడాది బ్రహ్మోత్సవాలను రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. భక్తులకు ఎలాంటి లోటు లేకుండా చూడాలని ఆదేశించినట్లు తెలిపారు. ఎంపీడీవో రమణ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో యాగంటి క్షేత్రానికి 24 గంటలు విద్యుత్‌కు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ఎస్ఐ దుగ్గిరెడ్డి మాట్లాడుతూ పార్కింగ్ సౌకర్యం, క్యూలైన్లను పర్యవేక్షించడానికి, వాహన దారులకు ఇబ్బందులు కలుగకుండా ప్రణాళికలు రూపొందించామన్నారు. యాగంటి ఆర్యవైశ్య అన్నదాన సంస్థ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ అధికారులకు అవసరమైన గదులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీఏ మద్దిలేటి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సాయి కృష్ణ, డాక్టర్ శివశంకర్, ఈవోఆర్‌డీ సతీశ్‌రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, నాయకులు మౌళీశ్వరరెడ్డి, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, యాగంటి ఆలయ సిబ్బంది ప్రసాద్, రమేశ్, గ్రామ కార్యదర్శి శకుంతల, వీఆర్వో కుళ్లాయి తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

చెత్త సంపద కేంద్రంలో పచ్చదనం

ఆహ్లాదానికి ఆనవాలు ఆ చెత్త సంపద కేంద్రం. కొబ్బరి చెట్లు, పండ్లు, పూల మొక్కలు అందరినీ స్వాగతం పలుకుతాయి. ఇక్కడికిపోతే పార్కులో ఉన్న అనుభూతి కలుగుతుంది. లద్దగిరి ఎస్‌డబ్ల్యూపీసీ నిండా పచ్చదనం పరచుకుంది. పంచాయతీ, పారిశుధ్య సిబ్బంది ఇందులో పాలుపంచుకుంటున్నారు. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధులతో ఆహ్లాదం, పరిశుభ్రత, ఆదాయం లక్ష్యంగా చెత్తసంపద కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. గ్రామంలో తరలించి తెచ్చే తడి, పొడి చెత్త, వేరుచేసి వర్మీకంపోస్టు తయారీ, ప్లాస్టిక్ వస్తువుల విక్రయించి ఆదాయం సమకూర్చుకోవడం ప్రధాన లక్ష్యం. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా లద్దగిరి పంచాయతీ ఆదాయం పొందుతోంది. అంతేగాకుండా చెత్తతో సంపద కేంద్రంలో మొక్కలు పెంచడంతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది.

- లద్దగిరి పంచాయతీ, పారిశుధ్య సిబ్బంది విశేష కృషి
- పార్కును తలపించే ఆహ్లాదకర వాతావరణం
- ఉన్నతాధికారుల ప్రశంసలు

కోడుమూరు రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): లద్దగిరి చెత్త సంపద కేంద్రంలో ఎత్తుగా పెరిగిన కొబ్బరి, జామ, సపోటా, సీతాఫలం, దానిమ్మ, మామిడి, మందారం, పాలసముద్రం మొక్కలు నాటారు. పచ్చదనం నిర్వహణకు పంచాయతీ, పారిశుధ్య సిబ్బంది విశేష కృషి చేస్తున్నారు. చెత్తతో సంపద కేంద్రంలో మొక్కల పెంపకం 2020లో ప్రారంభమైంది. ఆ ఏడాది ప్రత్యేకాధికారుల పాలన ఉండగా పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాణ్యం నర్సరీ నుంచి మొక్కలు తెప్పించి రిపబ్లిక్ డే రోజున అధికారులతో నాటించారు. ఈ నాలుగేళ్లలో మొక్కలన్నీ ఏపుగా పెరిగాయి. అప్పట్లో కలెక్టర్ కోటేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ చెత్తసంపద కేంద్రం



పార్కును తలపిస్తున్న చెత్తతో సంపద తయారీ కేంద్రం

తనిఖీ చేసి సిబ్బంది కృషిని ప్రశంసించారు.

లోకల్ ట్రైనింగ్ సెంటర్‌కు ఎంపిక

నిత్యం పారిశుధ్య పనులు చేపట్టి పరిశుభ్రతకు పాటుపడడం,



కార్మికులతో కలసి పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణ

వర్మీకంపోస్టు ఎరువు తయారీ ద్వారా ఆదాయం సమకూర్చుకోవడం, మొక్కలను పెంచి కేంద్రంలో పచ్చదనం నింపడంతో ఉన్నతాధికారులు 2023 ఫిబ్రవరిలో లద్దగిరి ఎస్‌డబ్ల్యూపీసీని లోకల్ ట్రైనింగ్ సెంటర్ కింద ఎంపిక చేశారు. అదే సమయంలో ఎంపిక చేసిన మరో రెండు పత్తికొండ, మురవణి ఎల్‌టీసీ సిబ్బందికి లద్దగిరిలో శిక్షణ అందించడం విశేషం. అలాగే ఆ ఏడాది మార్చిలో కర్నూలు, వెల్దుర్తి, గూడూరు, సీ బెళగల్, ఓర్వకల్ మండలాలకు చెందిన ఎంపీడీవోలు, ఈవోఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వ్యవసాయ, హార్టికల్చర్, వెటర్నరీ సిబ్బందికి పారిశుధ్య నిర్వహణపై లద్దగిరి కేంద్రంలో శిక్షణ అందించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాల నిర్వహణకుగాను 2022లో కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా ప్రశంసాపత్రం అందుకున్నారు.

బాధ్యత పెరిగింది



ప్రభుత్వ లక్ష్యం మేరకు చెత్తసంపద కేంద్రంలో మొక్కల పెంపకానికి పూనుకున్నాం. వెంటనే నర్సరీకి వెళ్లి మొక్కలు తీసుకవచ్చాం. మొక్కలను నాటినప్పటి నుంచి కంటికి రెప్పలా కాపాడుకున్నాం. ఎప్పటికప్పుడు నీరు అందించడం, పేడ, వర్మీకంపోస్టు ఎరువులు వేయడం మూలంగా బాగా పెరిగాయి. జిల్లా అధికారులు వచ్చి ప్రశంసించడం గర్వకారణంగా ఉంది. దీంతో మా బాధ్యత మరింత పెరిగింది.

-భూపన వెంకటేశ్వర్లు, లద్దగిరి పంచాయతీ కార్యదర్శి

బీసీలు ఐక్యమై హక్కులు సాధించుకోవాలి

- ఎంపీ బస్తిపాటి నాగరాజు



జాతీయ బీసీ సదస్సులో ఎంపీ

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బీసీలందరూ కలిసికట్టుగా ఉద్యమించి హక్కులను సాధించుకోవాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. ఢిల్లీలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ క్రిష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఓబీసీ జాతీయ సదస్సులో ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దేశంలో బీసీ జనాభా గణనీయంగా పెరుగుతోందని, జనాభాకు అనుగుణంగా బీసీలకు చట్ట సభలో 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కోరారు. బీసీల హక్కుల కోసం ఆర్ క్రిష్ణయ్య అలుపెరగని పోరాటం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలు రాష్ట్రాలకు చెందిన ఎంపీలు, ప్రజాప్రతినిధులు, బీసీ సంఘనాయకులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకల్లో ఎన్‌ఎస్‌ఎస్



విద్యార్థిని అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొని రాయలసీమ యూనివర్సిటీతో పాటు జిల్లా ఖ్యాతిని ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ ఎస్ హర్షవర్ధన్ నిలిపారని ఇన్‌చార్జి ఉపకులపతి ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ విజయకుమార్ కొనియాడారు. గురువారం ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థిని సన్మానించారు. ప్రాథమిక ఎంపిక దశ నుంచి పరేడ్‌లో పాల్గొనే వివిధ దశల్లో ప్రతిభ చూపడం అభినందనీయమన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్లు వెంకట రత్నం, బి. విజయుడు, నాగచంద్రుడు, శివప్రసాద్‌రెడ్డి, జోసఫ్, డిగ్రీ కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్ కే. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ వర్సిటీ ఖ్యాతిని పెంచాలి: ఉపకులపతి



విద్యార్థినిని అభినందిస్తున్న వీసీ

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వివిధ రంగాల్లో ప్రతిభను చాటి క్లస్టర్ యూనివర్సిటీ ఖ్యాతిని పెంచాలని ఉపకులపతి ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. గురువారం తన చాంబర్లో రిపబ్లిక్ డే పరేడ్‌లో ప్రతిభ చాటిన బీఏ 3వ సంవత్సరం విద్యార్థి ఎన్‌సీసీ క్యాడెట్ డి విష్ణువర్ధన్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వర్సిటీ దక్షిణ భారత దేశంలోనే మొదటిదని అన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు వర్సిటీలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, చదవుతో పాటు ఇలాంటి కార్యక్రమాల్లో ప్రతిభ చాటినప్పుడే మరిన్ని అవకాశాలు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ కే. వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డీన్ సత్యనారాయణ, డీన్ నాగన్న, పరీక్షల విభాగం కంట్రోలర్ బాలసుబ్రమణ్యం, ఎన్సీసీ క్యాడెట్లు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యజమాన్య ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థునులకు రాణి లక్ష్మీబాయి ఆత్మ రక్షణ పథకం కింద శిక్షణ ఇచ్చేందుకు రిజిస్టర్ అయిన సొసైటి, లేదా ట్రస్ట్ సంస్థల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కర్నూలు, జిల్లా సమగ్ర, శిక్ష ఆడిషనల్ డైరెక్టర్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంస్థలకు కనీసం 3 సంవత్సరాలపాటు సర్వీస్ ఉండాలన్నారు. ఆసక్తి గల సంస్థలు వెబ్ సైట్ నుంచి వివరాలను తెలుసుకొని పూర్తి చేసిన దరఖాసుల్తను కర్నూలు జిల్లాలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఇవ్వాలన్నారు.

ఫైర్‌మన్‌పై విచారణకు ఆదేశం

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఫైర్ స్టేషన్‌లో పని చేస్తున్న ఫైర్‌మన్ రాజ్‌కుమార్‌పై ఆ శాఖ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఫైర్ స్టేషన్‌కు చెందిన కొంత సిబ్బంది రాజ్‌కుమార్‌పై పలు ఆరోపణలు చేస్తూ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్‌కు ఓ లేఖ పంపారు. అందులో ఏడీఎఫ్ స్థాయి నుంచి డీజీ స్థాయి వరకు అందరినీ అసభ్యపదజాలంతో దూషిస్తుంటారని, మద్యం సేవించి ఆఫీసుకు వస్తుంటారని పేర్కొన్నారు. సిక్ లీవ్ పెట్టి రాజకీయ నాయకులతో పైరవీలు చేస్తుంటారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారికి ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. డీఎఫ్‌వో ఈ ఆరోపణలపై విచారణకు ఆదేశించారు. ఈ విచారణపై డీఎఫ్‌వో అవినాశ్ జయసింహను వివరణకోరగా రాజ్‌కుమార్‌పై వచ్చిన ఆరోపణలు విచారించాలని వచ్చిన ఆదేశాలు వాస్తవమే అన్నారు. విచారణ సిబ్బందితో అనుకూల రిపోర్టులు మలుచుకునేలా ప్రయత్నాలు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.

అట్టహాసంగా ప్రారంభమైన బాలోత్సవం

- పిల్లల్లోని నైపుణ్యాలను వెలికితీయాలి
- కలెక్టర్ రంజిత్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా





చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పిల్లల పండుగ బాలోత్సవం గురువారం కర్నూలు శివారులోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ రంజిత్ బాషా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పాఠశాలలోని కళ్యాణమ్మ వేదికపై జరిగిన ఈ కార్యక్రమానికి బాలోత్సవ కమిటీ గౌరవాధ్యక్షులు, రవీంద్ర విద్యాసంస్థల ఫౌండర్ జి.పుల్లయ్య, మాంటిస్సోరి విద్యాసంస్థల డైరెక్టర్ రాజశేఖర్, బాలోత్సవం అధ్యక్షుడు బేసాహేబ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల్లోని నైపుణ్యాలను వెలికితీయాలని సూచించారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఇతర కార్యక్రమాల్లోనూ పాల్గొనేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చూడాలన్నారు. తాను పాఠశాలలో మోనో యాక్షన్‌లో ఇన్‌స్పెక్టర్ రంజిత్ డైలాగులు చెప్పేవాడినని, అందుకే తన పేరు కూడా రంజిత్‌గా మారిందన్నారు. పిల్లలోని వారి నైపుణ్యం చూడడం వల్ల ఒక మంచి పేరు వస్తుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించాలని కోరారు. డీఈవో శామ్యూల్ పాల్ మాట్లాడుతూ ఇది పిల్లలకు ఒక పండుగ అని, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు మంచి వేదిక అని వివరించారు. విద్యతో పాటు అన్ని కలిసి ఉన్నప్పుడే విద్యార్థి సమగ్రంగా అభివృద్ధి చెందుతారన్నారు. బాలోత్సవ కమిటి రాష్ట్ర నాయకులు రామరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో 30 పట్టణాల్లో బాలోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్కులకే పరిమితం కాకుండా ఇతర రంగాల్లో ప్రావీణ్యం లేకపోవడం వల్ల ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. పోటీల ద్వారా పిల్లల్లో మానసిక పెరుగుదల ఉంటుందన్నారు. మొదటి రోజు 22 రకాల సాంస్కృతిక అకడమిక్ పోటీలు నిర్వహించారు. శాస్త్రీయ నృత్యం, సంప్రదాయ నృత్యాలు, వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, గీతాలాపన పోటీలు నిర్వహించారు. 57 పాఠశాలల నుంచి 2వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవ కమిటి సభ్యులు ఎల్లగౌడు, క్లస్టర్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ అక్తర్‌బాను, ప్రైవేటు విద్యాసంస్థల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు పీబీవీ సుబ్బయ్య, బాలోత్సవం కన్వీనర్ ధనుంజయ, ప్రధాన కార్యదర్శి జేఎన్ శేషయ్య, ప్రైవేటు విద్యాసంస్థల సంఘం జిల్లా అధ్యక్షుడు వాసుదేవయ్య, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లమలలో గూడ్స్ వాహనాలపై ఆంక్షలు



గూడ్స్ వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న రవాణాశాఖ అధికారులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నల్లమల మీదుగా వెళ్లే వాహనాలకు రవాణాశాఖ అధికారులు ఆంక్షలు విధించారు. రోడ్డు ప్రమాదాలను, ట్రాఫిక్ జామ్ సమస్యను దృష్టిలో వుంచుకుని ముందస్తు చర్యలుల్లో భాగంగా మార్చి 5వ తేది అన్ని రకాల గూడ్స్ వాహనాలను నల్లమలలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిలో అనుమతించమని రవాణాశాఖ అధికారులు ప్రకటించారు. దీంతో కర్నూలు నుంచి గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాలకు వెళ్లే గూడ్స్ వాహనాలు ఆత్మకూరు మీదుగా కాకుండా నంద్యాల, గిద్దలూరు మీదుగా వెళ్లాలని సూచించారు. అదే క్రమంలో ఆత్మకూరు, నందికొట్కూరు ప్రాంతాల నుంచి వెళ్లే గూడ్స్ వాహనాల అదే మార్గంలో వెళ్లాలని చెబుతున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

నిబంధనలు ఉల్లంఘించినట్లయితే రూ.25 నుంచి రూ.50వేల వరకు జరిమానా విధిస్తామని, డ్రైవింగ్ లైసెన్స్‌లను రద్దు చేస్తామని, వాహనం సీజ్ చేస్తామని, వాహనం పర్మిట్లను కూడా రద్దు చేస్తామని ఇప్పటికే రవాణా శాఖ అధికారులు హెచ్చరించారు. త్వరలోనే పోలీసుశాఖతో సమన్వయమై చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు.

గూడ్స్ వాహనదారులు సహకరించాలి



శ్రీశైలంలో జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల దృష్ట్యా క్షేత్రానికి ఇప్పటి నుంచే భక్తుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకై గుంటూరు, విజయవాడ ఇతర ప్రాంతాలకు వెళ్లే గూడ్స్ వాహనదారులు నల్లమలలోని నంద్యాల, గిద్దలూరు మీదుగా వెళ్లాలని సూచించాం. దీనివల్ల నల్లమలలోని కేజీ రహదారిపై వాహనాల రద్దీ కొంతైనా తగ్గుతుంది. కర్నాటక వాహనదారులకు ఈ విషయంపై అవగాహన కల్పించేందుకు కన్నడ భాషలోనే ప్రత్యేకంగా కరపత్రాలను ముద్రించి ప్రచారం చేస్తున్నాం.

-సత్యనారాయణరెడ్డి, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, ఆత్మకూరు

డ్రిప్.. సగానికి కోత

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంటున్న డోన్, పత్తికొండ, ఆలూరు, ఎమ్మిగనూరు తదితర నియోజకవర్గాల రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న డ్రిప్ ఇరిగేషన్ పథకం వరం లాంటిది. గత వైసీపీ పాలనలో డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని పూర్తిగా పాతిపెట్టేశారు. దీంతో రైతులు పొలాలను బీడు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ డ్రిప్ ఇరిగేషన్ పథకంపై పూర్తి స్థాయిలో రైతులకు ప్రయోజనం కల్పించే దిశగా నిర్ణయం తీసుకుంది. కర్నూలు, నంద్యాల జిల్లాలో దాదాపు 30వేల హెక్టార్లలో డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. కేవలం పది శాతం సబ్సిడీతో ఈ పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం నిధులను విడుదల చేస్తుండటంతో ఎక్కువ మంది రైతులు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పంటలు సాగు చేసుకునేందుకు ఉత్సాహాన్ని చూపుతున్నారు.



నిధులను తగ్గించిన కేంద్ర ప్రభుత్వం

అయితే.. ఇటీవల కేంద్ర ప్రభుత్వం 3 లక్షల యూనిట్ల ఏర్పాటుకు గాను కేవలం లక్ష యూనిట్ల వరకే డ్రిప్ ఇరిగేషన్ పథకానికి నిధులను సమకూరుస్తుండటంతో ఇచ్చిన లక్ష్యంలో సగానికి సగం కుదించాల్సిన పరిస్థితి నెలకొంది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 30వేల హెక్టార్లకు గాను కేవలం 14వేల హెక్టార్లలోనే డ్రిప్ ఏర్పాటుకు ప్రభుత్వం నిధుల కేటాయిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం రైతులు కర్నూలు జిల్లాలో 3,800 మంది దాకా డ్రిప్ పరికరాల కోసం తమ వాటా మొత్తాన్ని చెల్లించారనీ ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని, దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ దశలవారిగా డ్రిప్ పరికరాలు అందజేస్తామని తెలిపారు.

రంగుల చామంతి తోట



తంగడంచ వద్ద మూడు రంగులతో కనువిందు చేస్తున్న చామంతి

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగడంచ గ్రామానికి చెందిన ఆంజనేయులు ఆరు ఎకరాల్లో చామంతి పూలను సాగు చేశారు. ప్రస్తుతం కోత దశకు రావడంతో కిలో రూ. 60 నుంచి రూ. 90 వరకు పలుకుతోందని రైతు తెలిపారు. ప్రస్తుతం పెళ్లిళ్లు, పండుగలు ఉండటంతో ఆ మేరకు ధర పలుకుతోందని, ఇదే ధర ఉంటే రైతు లాభాలు గడిస్తారని పేర్కొన్నారు. తంగడంచ చెక్‌పోస్టు సమీపంలో పారుమంచాల రహదారి పక్కనే చామంతి తోట మూడు కలర్ల పూలతో చూపరులను కనువిందు చేస్తోంది.

మెరిట్ లిస్టు విడుదల

కర్నూలు హస్పిటల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో భర్తీ చేస్తున్న ఐదు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు సంబంధించిన మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు కర్నూలు డీఎంహెచ్‌వో డా.కె.శాంతికళ ఓ ప్రకటనలో తెలిపారు. కర్నూలు, నంద్యాల వెబ్‌సైట్‌లలో ఈ మెరిట్ జాబితాను ఉంచినట్లు తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కర్నూలు డీఎంహెచ్‌వో కార్యాలయంలో రాతపూర్వకంగా తెలపాలన్నారు.

నిలకడగా నీటి మట్టం



సున్నిపెంట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యాం నీటి మట్టం గురువారం 6 గంటల సమయానికి నిలకడగా ఉంది. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత్తం 852 అడుగులుగా నమోదైంది. నీటి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 84 టీఎంసీలుగా ఉంది. కృష్ణా నది పరివాహక ప్రాంతాల నుంచి నీటి ప్రవాహం కొనసాగలేదు. కుడి, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాల్లో ఉత్పాదన జరగకపోవడంతో దిగువ పరివాహక ప్రాంతాలకు నీటి విడుదల జరగలేదు.

లోకాయుక్త ద్వారా న్యాయం పొందవచ్చు

కర్నూలు లీగల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుదాఘాతానికి గురై మరణించిన వారి కుటుంబాలు రాష్ట్ర లోకాయుక్తను ఆశ్రయించి నష్టపరిహారం పొందవచ్చని రాష్ట్ర లోకాయుక్త రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. బాధిత కుటుంబాలు అవగాహనలేమితో కొంత మంది దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారని, బాధితులకు విద్యుత్ సంస్థలు నష్టపరిహారాన్ని చెల్లించకపోతే రాష్ట్ర లోకాయుక్తకు నేరుగా గానీ, పోస్టు ద్వారా గానీ తమ ఫిర్యాదులను పంపుకోవచ్చని రిజిస్ట్రార్ ఆ ప్రకటనలో తెలిపారు.

బాధితులకు సత్వర న్యాయం అందించిన లోకాయుక్త

కృష్ణా జిల్లా కంకిపాడు మండలం పునాదిపాడు గ్రామానికి చెందిన వీర్ల మల్లికార్జున స్వామి గత ఏడాది ఆగస్టు 15వ తేదీన తన పొలంలో విద్యుదాఘాతానికి గురై మరణించాడు. అతని భార్యాపిల్లలకు రూ.5 లక్షల నష్టపరిహారాన్ని ఏపీసీపీడీసీఎల్ సంస్థ చెల్లించాలని రాష్ట్ర ఉప లోకాయుక్త పి. రజని ఆదేశం ఇవ్వడంతో బాధితులకు సత్వర న్యాయం జరిగిందని రిజిస్ట్రార్ ఆ ప్రకటనలో తెలిపారు. మరొక కేసులో వైఎస్సార్ కడప జిల్లా ఉగుటూరు గ్రామ రైతులు కే. నాంచారమ్మ, లక్ష్మీ నారాయణ తాము కొనుగోలు చేసిన భూమిని తమ పేరిట మ్యుటేషన్ చేయాలని వీరప్పనాయునిపల్లె తాహసీల్దార్‌కు గతంలో అభ్యర్థించారు. అయితే అందుకు రెవెన్యూ అధికారులు స్పందించకపోవడంతో వారు రాష్ట్ర లోకాయుక్తను ఆశ్రయించారు. ఉప లోకాయుక్త పి. రజని ఆదేశాలతో రైతుల పేరిట మ్యుటేషన్ జరిగిందని రిజిస్ట్రార్ ఆ ప్రకటనలో తెలిపారు.

డీసీసీలో కలకలం

- ఈకేవైసీ కోసమే సొసైటీ ఏర్పాటు
- షర్మిలకు ఏం సంబంధం: డీసీసీ అధ్యక్షుడు మురళీకృష్ణ



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మురళీ కృష్ణ

(5వ పేజీ తరువాయి)

ఈకేవైసీ కోసం కళావెంకట్రావ్ భవన్ పేరుతో చేసుకున్న రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసుకున్నామని డీసీసీ అధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు. గురువారం సాయంత్రం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పరువు తీసే విధంగా నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీ నరసింహయాదవ్, నగర అధ్యక్షుడు జిలానీ బాషాల వ్యవహారం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దశ..దిశ ఉన్న కాంగ్రెస్ పార్టీ పరువు బజారున పడకుండా ఏదైనా ఉంటే సర్దు బాటు చేసుకుందామని వారికి సూచించానని తెలిపారు. సరే కేసు పెట్టారు... చట్టం తన పని తాను చేసుకుపోతుంది. చివరకు మీరే అవమాన పడాల్సి వస్తుందన్నారు. 2008 నుంచి యూత్ కాంగ్రెస్ పార్టీలో పని చేశా.. పార్టీ అంటే ఎంతో గౌరవం ఉందన్నారు. తనకు కాంగ్రెస్ పార్టీ ఆస్తులు అవసరం లేదని తెలిపారు. 'ఈ విషయంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిలమ్మను ఎందుకు లాగుతున్నారు. ఆమెకు ఏం సంబంధం' అని ప్రశ్నించారు. గత ఏడాది సెప్టెంబరు 14న కమిటీ చేసిన సిఫారసు ఆధారంగానే సొసైటీని రిజిస్ట్రేషన్ చేశామని తెలిపారు. అనంతరం ఎస్సీ సెల్ అధ్యక్షులు బజారన్న మాట్లాడుతూ నంద్యాల డీసీసీ, కర్నూలు నగర అధ్యక్షులు జిలానీ బాషాలు ఇద్దరు కించ పరిచే విధంగా తన పేరు ప్రస్తావించారని, వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి, పరువు నష్టం దావా వేస్తానని తెలిపారు.

విచారణకు పీసీసీ ఆదేశం

కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంఘటనకు సంబంధించి పూర్తి స్థాయి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు, మాజీ పీసీసీ చీఫ్ గిడుగు రుద్రరాజుకు పీసీసీ షర్మిల రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయ భవన సముదాయాలకు సంబంధించి పార్టీ నియమాలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై నిక్కచ్చిగా నివేదిక ఇవ్వాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు మురళీకృష్ణ సొంత ఆస్తులుగా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించి పార్టీకి సంబంధం లేని వ్యక్తుల పేర్లను చేర్చి అక్రమాలకు పాల్పడినట్లు ఇటీవల ఏపీసీసీకి ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని గిడుగు రుద్రరాజుకు బాధ్యతలు అప్పగించారు. వాస్తవాలు, పార్టీ ఆస్తుల వివరాలతో కూడిన నివేదికను కాంగ్రెస్ పార్టీ ఆస్తుల పరిరక్షణ కమిటీకి సమర్పించాలని కోరినట్లు షర్మిల ఓ ప్రకటన విడుదల చేశారు.

హైకోర్టులో పిల్ వేయడం దురదృష్టకరం



నేషనల్ లాయర్స్ ఫోరం అధ్యక్షుడు జయరాజు

కర్నూలు లీగల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ పిల్ దాఖలు చేయడం దురదృష్టకరమని.. స్వీయ ప్రచార ప్రయోజనాల కోసమే ఇలా దాఖలు చేశారని నేషనల్ లాయర్స్ ఫోరం అధ్యక్షుడు వై. జయరాజు ఒక ప్రకటనలో తెలియజేశారు. శ్రీబాగ్ ఒప్పందం మేరకు కర్నూలులో హైకోర్టు కానీ, రాష్ట్ర రాజధాని గానీ ఏర్పాటు చేయాలని, అయితే దీనిని వ్యతిరేకిస్తూ దాఖలైన పిల్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. ఈ పిల్‌లో పొందుపరిచిన అభ్యంతరాలు అవాస్తవమని అన్నారు. కాబట్టి దానిని ఉపసంహరించుకుని రాయలసీమ అభివృద్ధికి సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

డీజీపీని కలిసిన గోగిశెట్టి నరసింహారావు



డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గోగిశెట్టి నరసింహారావు

శిరివెళ్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): శిరివెళ్ల మండలం వీరారెడ్డిపల్లె గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావు డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ నూతన డీజీపీగా హరీష్ కుమార్ గుప్తా ఇటీవల బాధ్యతలు చేపట్టడంతో మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో గోగిశెట్టి నరసింహారావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నంద్యాల, కర్నూలు జిల్లాల్లోని పలు అంశాలపై టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావు డీజీపీ హరీష్ కుమార్ గుప్తాతో చర్చించారు.

రుణాల దరఖాస్తు గడువు పెంపు : కలెక్టర్

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 6: (ఆంధ్రజ్యోతి): బీసీ, ఈడబ్ల్యూఎస్ రుణాల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు ఈ నెల 12వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. ఈ రుణాల దరఖాస్తు కోసం లబ్ధిదారుల సౌకర్యార్థమై గడువు తేదీని పెంచినట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో శ్రీనివాసరావు

శ్రీశైలం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఏర్పాట్లను గురువారం ఆలయ ఈవో ఎం. శ్రీనివాసరావు, ఇంజనీరింగ్, తాగునీటి సరఫరా విభాగం అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈవో మాట్లాడుతూ భక్తులకు అసౌకర్యం కలగకుండా పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు నీటిని క్లోరినేషన్ చేయాలన్నారు. తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. క్షేత్ర పరిధిలో తాగునీటి ట్యాంకులు ఏర్పాటుతో పాటు వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. గణేశ్ సదనం ముందు ఏర్పాటు చేస్తున్న మినీ కల్యాణ కట్ట, సెంట్రల్ పార్కింగ్ ప్రదేశాలను పరిశీలిచారు. సీఆర్వో కార్యాలయం పక్కన పార్కింగ్ ప్రదేశంలో ప్రసాదం విక్రయం కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆలయ సిబ్బందిని ఆదేశించారు. ఈఈలు బాలమురళీ కృష్ణ, నరసింహారెడ్డి, డీఈ చంద్రశేఖర శాస్త్రి, ఏఈ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

వక్ఫ్ స్థలాల గుర్తింపు

నంద్యాల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బండి ఆత్మకూరు మండల పరిధిలో 72 ప్రాంతాల్లోని వక్ఫ్ స్థలాల జాబితాను ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. జీవో నెంబర్ 16, వక్ఫ్ చట్టం 1995, నెంబరు 43 కింద సదరు స్థలాలను సమగ్ర జాబితాను ఆశాఖ కమిషనర్‌తో పాటు జిల్లా కలెక్టర్, ఆశాఖ మంత్రికి లిఖితపూర్వకంగా పంపినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇళ్ల స్థలాల పేరుతో
భారీ కుంభకోణం

- గత ప్రభుత్వంలో వైసీపీ నాయకుల ఇన్‌సైడ్ ట్రేడింగ్
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి



విలేకరులతో మాట్లాడుతున్న ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి

కర్నూలు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): 'పేదలకు ఇళ్ల స్థలాల భూ సేకరణ పేరిట వైసీపీ హయాంలో భారీ కుంభకోణం చోటుచేసుకుంది. వైసీపీ నాయకులు ఇన్‌సైడ్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారు. భూసేకరణకు ముందే రైతులతో తక్కువ ధరలకు అగ్రిమెంట్ చేసుకుని.. తర్వాత అమాంతంగా ధరలు పెంచేసి ప్రభుత్వం కొనుగోలు చేసేలా కుట్రలు చేశారు...' అని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ఆరోపించారు. వైసీపీ హయాంలో జరిగిన భూ కుంభకోణంపై విచారణ చేయాలంటూ గురువారం కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ హయంలో జగనన్న కాలనీలు, పేదలకు ఇళ్ల స్థలాలు పేరిట సాగించిన భూ సేకరణలో రాష్ట్రంలో రూ.వందల కోట్లు ప్రజాధనం దోపిడీ చేశారని ఆరోపించారు. ఆదోని పట్టణ శివారులో దాణాపురం వద్ద జగనన్న కాలనీ నిర్మాణం కోసం 65 మంది రైతుల నుంచి 178 ఎకరాలు సేకరించారని తెలిపారు. 2020 మార్చి 6న జారీ చేసిన 29/2020, 30/2020 భూ సేకరణ నోటీసుల ద్వారా రూ.24.03 కోట్లు ఖర్చు చేశారని గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో నాటి ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి, ఆయన తనయుడు వై.మనోజ్ రెడ్డి, అనుచరులు ఎర్రిస్వామి, చంద్రకాంత్‌రెడ్డి, కామాక్షి తిమప్ప, బి.నరసింహులు, జి.సందీప్‌రెడ్డి, కామవరం మహేందర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులతో పాటు అప్పటి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ) టి.జయరామిరెడ్డిల ద్వారా రైతులతో బలవంతంగా ముందస్తు ఒప్పందాలు చేసుకునేలా ఒత్తిడి చేశారని ఆరోపించారు.

ఎకరాకు రూ.5 లక్షలు మాత్రమే నష్ట పరిహారం ఇవ్వబోతున్నట్లు రైతులను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. ఎకరానికి రూ.13 లక్షల నుంచి రూ.23 లక్షల వరకు ప్రభుత్వం ధర నిర్ణయించిన రైతులకు తెలియకుండా చేశారని, ఆ తరువాత అదే భూమిని ఎక్కువ ధరకు సేకరించడం ద్వారా రైతులను తీవ్రంగా మోసం చేశారని ఆరోపించారు.

బెదిరించి వసూలు..

ప్రభుత్వం రైతులకు భూ నష్టపరిహారం చెల్లించిన వెంటనే అప్పటి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఆయన అనుచరులు రైతులను బెదిరించి ఎకరాకు రూ.7-8 లక్షలు అక్రమంగా వసులు చేశారని ఎమ్మెల్యే పార్థసారధి ఆరోపించారు. ప్రశ్నించిన రైతులపై అక్రమ కేసులు పెట్టడమే కాకుండా దాడులకు కూడా పాల్పడ్డారన్నారు. ప్రభుత్వం రైతులకు చెల్లించిన రూ.24.03 కోట్లలో రూ.8.90 కోట్లు మాత్రమే రైతులకు చేరిందని, మిగిలిన రూ.15.13 కోట్లు అక్రమ మార్గాల్లో మళ్లించారని, భూసేకరణలో జరిగిన భారీ కుంభకోణం అన్నారు. సమగ్ర విచారణ చేసి అక్రమార్కులపై చర్యలు తీసుకోవడంతో పాటు రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

- 8 మందికి గాయాలు
- రాంగ్ రూట్‌లో వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టిన కారు



డివైడర్‌ను ఢీకొన్న కారు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై గురువారం సాయంత్రం ఓర్వకల్లు గ్రామ సమీపాన గల పవర్ గ్రిడ్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా.. మరో 8 మందికి గాయాలయ్యాయి. కర్ణాటక రాష్ట్రం రాయచూరు చెందిన 12 మంది కుటుంబ సభ్యులు తిరుపతిలో వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని స్వగ్రామానికి వెళ్తుండగా.. ఓర్వకల్లు పవర్‌గ్రిడ్ వద్ద రాంగ్ రూట్‌లో వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి కారు డీవైడర్‌ను ఢీకొట్టింది. కారులో ఉన్న జానకి (60) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందగా.. చిన్నారి నిహారిక (4) ఓర్వకల్లు పీహెచ్‌సీలో చికిత్స పొందుతూ మృతి చెందింది. తండాకు చెందిన శ్రీనివాస్ నాయక్ తన వాహనంలో బాలికను సీహెచ్‌సీ తీసుకెళ్లగా అప్పటికే చిన్నారి మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. ప్రమాదం జరగ్గానే కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు ఎస్‌ఐ సునీల్ కుమార్ సందర్శించి క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కారులో 12 మంది ఉండగా.. అందులో ఇద్దరు మృతి చెందారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో నలుగురు, ఓర్వకల్లు సీహెచ్‌సీలో నలుగురు చికిత్స పొందుతున్నారు. ప్రమాదంలో ఇద్దరు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సునీల్‌కుమార్ తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- సుంకేసుల డ్యాంలో యువకుడి మృతి

గూడూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని సుంకేసుల డ్యాంలో ఈతకు వెళ్లిన యువకుడు షేక్ రఫి (17) మృత్యువాత పడినట్లు గూడూరు ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలివీ.. తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి గ్రామానికి చెందిన షేక్ రఫీ తోటి స్నేహితులు రెహిమాన్, షేక్ గనితో కలిసి సుంకేసుల డ్యాం వద్ద ఈతకు వెళ్లారు. సుంకేసుల డ్యాం కింద ఉన్న మొర్రెన్న గుంత దగ్గర ముగ్గురు యువకులు ఈత కొడు తుండగా షేక్ రఫీ నీటిలో మునిగిపోయాడు. గమనించిన తోటి స్నేహితులు రెహమాన్, గని ఒడ్డుకు వచ్చి చేపలు పడుతున్న వారికి విషయాన్ని చెప్పారు. దీంతో చేపలు పట్టే వారు గజ ఈతగాళ్ల నీటిలో దిగి గాలింపు చేపట్టి షేక్ రఫీ మృతదేహాన్ని బయటకు తీశారు. ఎస్‌ఐ తిమ్మయ్య, సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు.

వాహనం ఢీకొని మహిళ..

మిడుతూరు, ఫిబ్రవరి 6(ఆంధ్ర జ్యోతి): మండలంలోని వీపన గండ్ల గ్రామానికి చెందిన ఉమామహేశ్వరి(45) గుర్తు తెలియని వాహనం ఢీ కొని గురువారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఉమామహేశ్వరి ఇంటి వద్ద నుంచి వీపనగండ్ల గ్రామ సమీపంలోని పొలానికి రహదారి వెంబడి నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికి అక్కడే మృతి చెందారు. మహిళ కుమారుడు మనోజ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సుబ్బయ్య తెలిపారు.

యువకుడి హత్య

నందికొట్కూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరుకు చెందిన యువకుడు తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా కొత్తకోట మండలం చిన్న చింతకుంట గ్రామంలో హత్యకు గురయ్యాడు. నందికొట్కూరుకు చెందిన అలీఖాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే గురువారం చింతకుంటలో హత్యకు గురయ్యాడు. అయితే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పెబ్బేరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

గుండెపోటుతో తండ్రీ కొడుకుల మృతి

- కుమారుడి మృతిని జీర్ణించుకోలేక తండ్రికి గుండెపోటు



రబ్బాని (ఫైల్)



తండ్రి జహంగిర్(ఫైల్)

చాగలమర్రి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలో 24 గంటల్లోనే కుమారుడు, తండ్రి మృతి చెందిన విషాద ఘటన గురువారం చోటు చేసుకుంది. కుమారుడు రబ్బాని (32) గుండెపోటుతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కుమారుడు మృతిని జీర్ణించుకోలేక తండ్రి జహంగిర్‌బాషా(64) గురువారం తెల్లవారు జామున గుండెపోటుకు గురై మృతి చెందాడు. కుమారుడు మృతి రోజు కుటుంబీకులు, బంధువులు, స్నేహితుల నడుమ కుమారుడి అంత్యక్రియలు చేశాడు. కుమారుడిని తలచుకుంటూ మనస్థాపంతో గుండెపోటు రావడంతో మృతి చెందాడు. ఈ సంఘటనతో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న జహంగిర్‌బాష, ఆసరగా ఉన్న రబ్బాని గుండెపోటుతో మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీటి పర్యంత మయ్యారు. తండ్రి జహంగిర్‌బాషా గ్రామ పంచాయతీలో దినబండ్ల మార్కెట్ వేలం పాట పాడి వచ్చిన ఆదాయంతో కుటుంబ పోషణ చేసేవాడు. కుమారుడు రబ్బాని బంగారు పని చేసుకుంటూ కుటుంబానికి ఆసరాగా ఉండేవాడు. జహంగిర్‌బాషాకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రబ్బానికి భార్య, కూతురు ఉన్నారు.

కేసీ ఉప కాల్వలోపడి మహిళ..



సోమక్క మృతదేహం

శిరివెళ్ల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందపల్లె గ్రామ సమీపంలో కేసీ ఉప కాల్వలో పడి ఓ మహిళ మృతి చెందింది. శిరివెళ్ల ఎస్‌ఐ చిన్న పీరయ్య తెలిపిన వివరాలివీ.. గోవిందపల్లెకు చెందిన సోమక్క (54) కొంత కాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతుండేది. ఈ నెల 5వ తేదీన కేసీ ఉపకాల్వలో దుస్తులు ఉతికేందుకు వెళ్లిన సమయంలో మూర్ఛ రావడంతో ప్రమాదవశాత్తు కాల్వలోపడి ఊపిరాడక మృతి చెందింది.గురువారం ఉదయం సోమక్క మృతదేహాన్ని కాల్వ నుంచి బయటకు తీసి పంచనామా నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలి కుమారుడు రమావత్ గోపాల్ నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిన్న పీరయ్య వెల్లడించారు.

డైస్‌ను పరిశీలించిన న్యాయాధికారి



అధికారులతో మాట్లాడుతున్న లీలా వెంకటశేషాద్రి

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం (డైస్)ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళతో కలిసి పరిశీలించారు. డీఎంహెచ్‌వో, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డా.కే. శైలేష్ కుమార్, మేనేజర్ షేక్ ఇర్ఫాన్ ౦ నుంచి 18 సంవత్సరాల పిల్లలకు అందించే వైద్యసదుపాయాలను న్యాయమూర్తికి వివరించారు. కేంద్రంలో పుట్టుకతో లోపం ఉన్న చిన్నారులకు, చెవి, కంటి విటమిన్ మానసిక లోపం గల పిల్లలకు శిక్షణ పొందిన వైద్యులచే ఉచిత వైద్యం అందిస్తున్నామని డీఎంహెచ్‌వో వివరించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి మాట్లాడుతూ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు లీగల్ సర్వీసెస్, ఇంటింట సర్వే నిర్వహించడానికి న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, ఆశా, ఏఎన్ఎంలు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లతో టీమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఫిబ్రవరి 10 నుంచి 24వ తేదీ వరకు విభిన్న సామర్థ్యం గల పిల్లలను, ఆరోగ్య లోపాలు ఉన్న పిల్లలను గుర్తించి డైస్‌లో చికిత్సలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది కరుణజ్యోతి, పారా లీగల్ వలంటీర్లు డా. రాయపాటి శ్రీనివాసులు, సుధ, హేమంత్, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు జ్యోష్ణ లక్ష్మి, డెమో శ్రీనివాసులు పాల్గొన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

రేపటి నుంచి కురుకులాంబ దేవి ఆలయ వార్షికోత్సవాలు

ఆత్మకూరు రూరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలోని కురుకుంద గ్రామంలో వెలసిన కురుకులాంబదేవి ఆలయ వార్షికోత్సవం, అలాగే అమ్మవారి జన్మదిన వేడుకలను ఈ నెల 8వ తేది నుంచి 12వ తేది వరకు నిర్వహించనున్నట్లు ఆలయ పురోహితులు కృష్ణమోహన శర్మ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో కురుకులాంబ అమ్మవారికి శ్రీసూక్త అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ గావించి, అష్టోత్తర పూజలు, కలశ స్థాపన గావించిన అనంతరం గణపతి హోమం, మన్యుసూక్త హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 9న అరుణ హోమం, 10న రుద్రహోమం, 11న లలితా సూక్త హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకల్లో చివరిరోజైన మార్చి 12వ తేదీన అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకొని అమ్మవారికి అభిషేక క్రతువులు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం దంపతుల ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో చండీ హోమం, బలిదానం, పూర్ణాహుతి, మర్దానం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

12న బోనాల మహోత్సవం

ఆత్మకూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణ శివార్లలోని జంబులాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈనెల 12న మాఘశుద్ధ పౌర్ణమి (భారతాల పౌర్ణమి) వేడుకను పురస్కరించుకుని బోనాల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. లోకకల్యాణార్థం ఏటా మాఘశుద్ధ పౌర్ణమి రోజున అమ్మవారికి మహిళలతో బోనాలను ఆనవాయితీగా సమర్పిస్తారు. ఈ వేడుకలో భాగంగానే అమ్మవారికి విశేష అలంకరణ చేసి వేదపండితుల ఆధ్వర్యంలో యాగక్రతువులను అభిషేకాలు, కుంకుమార్చనలు వంటి పూజా క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయనున్నారు.

ఘనంగా మధ్వనవమి

ఆత్మకూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని బ్రాహ్మణవీధిలో గల ముఖ్యప్రాణ స్వామి ఆలయంలో గురువారం మధ్వనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మధ్వాచార్యుల వారికి విశేష పంచామృతాభిషేకం, విశేష అలంకరణ గావించారు. ఆతదుపరి మహామంగళహారతి, తీర్థగోష్టి క్రతువులను రుత్వికులు సంప్రదాయబద్ధంగా చేపట్టారు. అనంతరం బ్రాహ్మణులకు అన్నసంతర్పణ నిర్వహించారు. ఉడుపి బ్రాహ్మణుడు కృష్ణప్రసాద్ భట్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి: ఫిరోజ్



డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. పట్టణంలోని 7,8 వార్డుల్లో గురువారం పర్యటించారు. ఫిరోజ్ మాట్లాడుతూ వైసీపీ హయాంలో వార్డులను నిర్లక్ష్యం చేశారని అన్నారు. ఇళ్ల మధ్యలో వర్షపు నీరు, కంప చెట్లు, వీధుల్లో దెబ్బతిన్న కరెంటు స్తంభాలు, వేలాడుతున్న కరెంటు తీగలు, వెలగని వీధి దీపాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఈ నేపథ్యంలో వార్డుల సమస్యలు స్వయంగా తెలుసుకుని సమస్యలు పరిష్కరించడానికి 'మన ఊరు మన బాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఇటీవల 8వ వార్డు ఉప్పరిపేటలో నూతనంగా ప్రారంభమైన సచివాలయాన్ని సందర్శించి సచివాలయ సిబ్బంది సమస్యలు ఆరా తీసారు. టీడీపీ 8వ వార్డు ఇన్‌చార్జి ఉప్పర సురేష్ కుమార్, ఉప్పరి సుబ్రిక్, మాజీ కౌన్సిలర్ రవికుమార్, గోవింద నాయుడు, పసుపులేటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు బరక సంజీవరాయ స్వామి రథోత్సవం

మిడుతూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మిడుతూరు మండలంలోని రోళ్లపాడు అభయ అరణ్యంలో వెలసిన బరక సంజీవరాయస్వామి రథోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పేరెడ్డి మురళీమోహన్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆలయంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన, సీతారాముల కల్యాణం, అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేడు న్యూ కేటగిరీ రాష్ట్ర స్థాయి ఎద్దుల పోటీలు

రోళ్లపాడు అభయ అరణ్యంలో వెలసిన బరక సంజీవరాయ స్వామి 14 వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం 8 గంటలకు న్యూ కేటగిరీ రాష్ట్రస్థాయి ఎద్దుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. రూ.700 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేరును నమోదు చేసుకోవాలని తెలిపారు. మొదటి ఆరు బహుమతులు వరుసగా రూ. 50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందజేయనున్నట్లు తెలిపారు.

రేపు నాలుగు పళ్ల ఎద్దుల పోటీలు

శనివారం ఉదయం 8 గంటలకు రాష్ట్ర స్థాయి నాలుగు పళ్ల ఎద్దుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వహకులు తెలిపారు. రూ.600 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేరును నమోదు చేసుకోవాలని తెలిపారు. మొదటి ఆరు బహుమతులు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు అందజేయనున్నట్లు తెలిపారు.

'రోడ్డు భద్రత నియమాలు పాటించాలి'



మాట్లాడుతున్న ఎస్ఐ లక్ష్మీనారాయణ

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రోడ్డుభద్రత నియమనిబంధనలను పాటించి సురక్షితంగా గమ్యం చేరుకోవాలని ఎస్ఐ లక్ష్మీనారాయణ సూచించారు. గురువారం డ్రైవర్ల దినోత్సవాన్ని మండల కేంద్రం జూపాడుబంగ్లా సంతమార్కెట్‌లో ఘనంగా నిర్వహించారు. ఎస్ఐ ముఖ్యఅతిథిగా పాల్గొని తీసుకొచ్చిన పెద్దకేకును కట్ చేశారు. కార్మికులందరు డ్రైవర్ల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకుని మిఠాయిలను పంపిణీ చేశారు. డ్రైవర్ల సంఘం నాయకులు గణపతి, ఖాజా, చాంద్‌బాషా, బాలవెంకట్, డ్రైవర్లు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వ కళాశాల విద్యార్థులు సెయింట్ లూక్స్ అంధ విద్యార్థులకు నిత్యావసర సరుకులను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శశికళ ఆధ్వర్యంలో భౌతికశాస్త్ర విభాగం విద్యార్థులు సెయింట్ లూక్స్ అంధుల పాఠశాల విద్యార్థులకు నిత్యావసర సరుకులు అందజేశారు. అధ్యాపకులు శైలజారెడ్డి, పార్వతి, శశికళ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంపద సృష్టికి మార్గం ఏదీ?

● కొత్త ముచ్చుమర్రిలో దారి లేక వినియోగంలోకి రాని చెత్త సంపద కేంద్రం ● పగుళ్లు ఇచ్చిన సిమెంట్ తొట్లు





కొత్త ముచ్చుమర్రి గ్రామంలో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రం, పగుళ్లు ఇచ్చిన తొట్లు

పగిడ్యాల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి వాటి నుంచి రైతులకు అవసరమైన సేంద్రియ ఎరువులను తయారు చేసేందుకు ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాలు వెళ్లేందుకు దారి లేక నిరుపయోగంగా మారాయి. లక్షల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన కేంద్రాలను ఏళ్ల తరబడి వినియోగంలోకి తీసుకొనిరాకపోవడంతో ప్రజా ధనం వృథాగా మారిందని పలువురు మండిపడుతున్నారు. మండలంలోని కొత్త ముచ్చుమర్రి గ్రామంలో ఐదేళ్ల క్రితం నిర్మించిన చెత్త సంపద కేంద్రం నిరుపయోగంగా మారింది. గత టీడీపీ హయాంలో గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి వాటిని చెత్త సంపద నిల్వ కేంద్రాలలో ఉంచి రైతులకు అవసరమైన సేంద్రియ ఎరువులను తయారు చేసి వాటిని రైతులకు విక్రయించగా వచ్చిన సొమ్ముతో గ్రామాలను అభివృద్ధి చేసుకునేలా ప్రభుత్వం లక్షల రూపాయాలను ఖర్చు చేసి కేంద్రాల నిర్మాణానికి పూనుకుంది. అయితే అప్పట్లో గ్రామంలో స్థలం కొరత కారణంగా అప్పటి మండలస్థాయి అధికారులు కేసీ కాలువ సమీపంలో షెడ్‌లను ఏర్పాటు చేశారు. అయితే ఈ షెడ్లకు వెళ్లడానికి దారి లేదు. ప్రస్తుతం గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకొని రావాలని జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో సిబ్బంది సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. షెడ్లను వినియోగంలోకి తీసుకురాక ముందే సిమెంట్ తొట్లు పగుళ్లు ఇచ్చి శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో షెడ్డులో చెత్త నిల్వ చేసుకునే పరిస్థితి కనబడటం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శి కాశీం సాహెబ్‌ను వివరణ కోరగా.. గతంలో ఉన్న అధికారులు షెడ్డుకు వెళ్లేందుకు దారి చూపకపోవడంతో నిరుపయోగంగా మారింది. విషయాన్ని జిల్లా అధికారుల దృష్టి తీసుకుపోవడంతో కేసీ కెనాల్ అధికారులతో మాట్లాడి షెడ్డుకు వెళ్లేందుకు అవసరమైన దారి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గ్రామ పంచాయతీ నిధులతో శిథిలావస్థకు చేరుకున్న సిమెంట్ దిమ్మెలకు మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. త్వరలోనే చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకొస్తామని చెప్పారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

ఆత్మకూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపద్మావతి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి సీనియర్ ఖోఖో జట్ల ఎంపిక పోటీల్లో సత్తా చాటినట్లు పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ పి.ఆశ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. ఉమ్మడి కర్నూలు సీనియర్ జిల్లా ఖోఖో ఎంపిక పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు బాలికల విభాగంలో హారిక, రిజ్వాన, శాలుబి, చందన ఎంపికైనట్లు తెలిపారు. బాలుర విభాగంలో దినేష్, శరత్ చోటు సంపాదించుకున్నట్లు చెప్పారు. వీరు త్వరలో ప్రకాశం జిల్లాలోని పంగులూరులో జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులను పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్‌తో పాటు ప్రధానోపాధ్యాయులు మర్తుజావతి, సురేష్ అభినందించారు.

క్రీడాకారులకు అభినందన

నంద్యాల హాస్పిటల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని గురురాజ పాఠశాలలో రాష్ట్ర జాతీయ స్థాయిలో పలు క్రీడాంశాలలో పాల్గొన్న క్రీడాకారులను గురువారం పాఠశాల డైరెక్టర్ షేక్షావలి రెడ్డి అభినందించారు. ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్స రంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, వివిధ అసోసియేషన్ల క్రీడలలో తమ పాఠశాల క్రీడాకారులు పాల్గొని విజేతలుగా నిలిచారన్నారు. అండర్ 14,17 బాల బాలికల విభాగాల్లో త్రో బాల్, ఫుట్ బాల్, బాల్ బ్యాడ్మింటన్, ఖోఖో, సాఫ్ట్‌బాల్, ఫెన్సింగ్, బేస్‌బాల్, చెస్ పోటీల్లో 45 మంది క్రీడాకారులు ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. పాఠశాల తరపున జిల్లా, రాష్ట్ర జట్లకు ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులను శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

మోటార్ సైకిళ్ల సీజ్



ఆర్టీసీ బస్టాండ్ దగ్గర స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

నంద్యాల క్రైం ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాల వన్ టౌన్ సీఐ సుధాకర్ రెడ్డి నెంబర్ ప్లేట్లు లేని వాహనాలపై గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నెంబర్ ప్లేట్లు లేని 17 మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ నెంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతూ నేరాలకు పాల్పడే అవకాశం లేకుండా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఎస్పీ అధిరాజ్ రాణా ఆదేశాల మేరకు డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. నెంబర్ ప్లేట్లు లేకుండా తిరిగే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి తెలిపారు.

'పురాతన ఆలయాల పరిరక్షణ మనందరి బాధ్యత'



పాణికేశ్వర ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

పాణ్యం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పురాతన ఆలయాల పరిరక్షణ మనందరి బాధ్యత అని నేషనల్ గ్రీన్‌కోర్ రాష్ట్ర డైరెక్టర్ స్రవంతి అన్నారు. ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవ వారోత్సవాలలో భాగంగా గురువారం డీఈవో జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో పాణ్యం శ్రీపాణికేశ్వర ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. స్రవంతి మాట్లాడుతూ పురాతన ఆలయాలను పరిరక్షించడంలో బాగంగా ఆలయ పరిసరాలు పర్యావరణ క్లబ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు శ్రమదానం చేసి శుభ్రం చేశారన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గిరిజన పాఠశాల, విజయానికేతన్ పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు ఈ శ్రమదానం లో పాల్గొన్నారని చెప్పారు. వీరితో పాటు ఎన్సీసీ క్లబ్, నేషనల్ గ్రీన్ కోర్ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఆలయ పరిసరాలలోని కంపచెట్లు, చెత్తా చెదారాన్ని తొలగించారు. ఆలయ పురాతన చరిత్రను విద్యార్థులకు వివరించారు. ఆలయాల పరిశుభ్రతతోపాటు సమాజ సేవలో పాల్గొనాలని డైరెక్టర్ కోరారు. ఆలయం వద్ద మొక్కలు నాటారు. ఎంఈవో కోటయ్య, సువర్ణ, చంద్రశేఖరరెడ్డి, సుందర్‌రావు, సునీత, కుమార్‌బాబు, కృష్ణానాయక్, మానవతా సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

వస్తువుల స్వాధీనం

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు రాష్ట్రంలో పలు దొంగతనాలు, వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న దొంగల కోసం ఏకంగా బండిఆత్మకూరు, గడివేముల, పాణ్యం పోలీసులతో పాటు, మరో 30 మంది రిజర్వ్ పోలీసు బలగాలతో మండలంలోని పరమటూరు, గడివేముల మండలం కరిమద్దుల గ్రామాల మధ్య పొలాల్లో రెండు రోజులుగా తీవ్ర గాలింపు చేపట్టారు. మంగళవారం పరమటూరుకు చెందిన 70 మంది గ్రామస్థులతో పాటు పోలీసులు కరిమద్దెల దారిలోని ఓ పొదలో కరుడు గట్టిన దొంగలు నక్కి ఉన్నట్లు డ్రోన్ల సహాయంతో గుర్తించారు. వారి కోసం ఏకంగా కొందరు చెంచులను సైతం వెంటబెట్టుకుని వెళ్లగా పోలీసుల, స్థానికుల కళ్ల ఎదుటే దొంగలు కత్తులతో స్వైరవిహారం చేస్తూ ఒకరు నక్కల వాగులో దూకి వెళ్ళగా, మరొకడు జొన్న పంట పొలాలగుండా పరారైనట్లు సమాచారం. వారు ఉన్న స్థలంలో వారి బట్టలు, మందు బాటిళ్లు, నీళ్ళ క్యాను, సిగరెట్లు, సెల్‌ఫోన్లు, సబ్బులు, సోలార్ లైట్లు, కత్తులు, ఇతరత్రా సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

'ఉపాధ్యాయుడిని విధుల్లోకి తీసుకోవాలి'

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ సస్పెండ్ అయిన రాజునాయక్‌ను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. నంద్యాలలో నిర్వహించిన సమావేశంలో నాయకులు సాంబశివుడు, నగిరిశ్రీనివాసులు మాట్లాడుతూ గత ఏడాది విద్యార్థినిని దూషించారన్న ఫిర్యాదుతో రాజునాయక్‌ను సస్పెండ్ చేశారన్నారు. విచారణ అనంతరం గత ఏడాది నవంబర్ నెలలో పునర్ నియామకం చేస్తూ ఉత్తర్వులు వచ్చినా నేటి వరకు విధుల్లోకి తీసుకుపోవడం దారుణమన్నారు.

29 పురుష పొదుపు సంఘాల ఏర్పాటు

నంద్యాల మున్సిపాలిటీ ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పేద మహిళలకే కాకుండా పేద పురుషులను ఆర్థికంగా అండ అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇటీవల పొదుపు సంఘాలు పథకంప్రవేశపెట్టింది. ఇందులో నంద్యాలలో ఇప్పటివరకు 29 వరకు పురుష పొదుపు సంఘాలు ఏర్పడినట్లు నంద్యాల మెప్మా అధికారి తేజశ్విని శోభ గురువారం తెలిపారు. పురుష పొదుపు సంఘాల్లో 5 మంది సభ్యులు మాత్రమే ఉంటారని ఆమె తెలిపారు. సంఘాల్లో భవన నిర్మాణ కార్మికులతో పాటు రవాణా , గిగ్ పనివారు, డొమెస్టిక్, చెత్తపనివారు, కేర్ వర్కర్లు ఉంటారు. కాగా సదరు పురుష సంఘాలకు లభించాల్సిన ఆర్థిక లబ్ధి తదితర విషయాలపై ప్రభుత్వం నుంచి విధి విధానాలు రావాల్సి ఉందని మెప్మా అధికారి తెలిపారు.

రుణాల దరఖాస్తుకు గడువు పెంపు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, బలిజ, ఒంటరి కులాలకు చెందిన వారికి సబ్సిడీతో కూడిన రుణాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా వెనకబడిన తరగతుల సేవా సహకారం సంఘం లిమిటెడ్ కార్యనిర్వహణాధికారి జాకీర్ హుస్సేన్ తెలిపారు. బ్యాంకు అనుసంధానంతో సబ్సిడీతో కూడిన రుణాలకు సంబంధించి అర్హత కలిగిన లబ్ధిదారులు ఏపీఓబీఎంఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే ఈడబ్ల్యూఎస్ (ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, బ్రాహ్మిన్, క్షత్రియ)కులాలకు చెందిన వారు సెల్ఫ్ డిక్లరేషన్ చేసి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పోస్టర్లు విడుదల



మిడుతూరులో పోస్టర్లను విడుదల చేస్తున్న వైద్యాధికారులు

మిడుతూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): 'స్టెమి.. గుండెకు భరోసా' అలాగే హృదయ రక్ష పోస్టర్లను గురువారం మిడుతూరు ప్రభుత్వ వైద్య శాలలో ఎంపీడీవో దశరథ రామయ్య, వైద్యాధికారులు తిరుపతి, భరత్ కుమార్, శారద, సాయిసుధ విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఛాతి నొప్పి, ఆయాసం, స్పృహ కోల్పోవడం, గుండె దడ వంటి లక్షణాలతో ప్రభుత్వ వైద్యశాలకు వచ్చిన రోగులకు ఈసీజీ ద్వారా గుండె పోటును గుర్తించి ఉచితంగా రూ. 40 వేల విలువ చేసే అత్యవసర మైన ఇంజెక్షన్ టెనెక్టిప్లేస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. పైన తెలిపిన లక్షణాలు ఉన్నవారు ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి టెనెక్టిప్లేస్ ఇంజెక్షన్ ద్వార ప్రాణాలు కాపాడుకోవాలని వారు కోరారు. వైద్యాధికారులు వ్యామ కేస్, కిరణ్, వైద్య సిబ్బంది ముర్తుజావలి, రామతులసి, సువేద, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ప్రజలుపాల్గొన్నారు.

'పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి'



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిరుపేదలకు రెండుసెంట్లు ఇంటి స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని టెక్కె మార్కెట్ యార్డు నుంచి అర్జిదారులతో తహశీల్దార్ కార్యలయం వరకు ర్యాలీగా వెళ్లి డిప్యూటీ తహసీల్దార్ రామసంజీవరావుకు వినతి పత్రం సమర్పించారు. నాగేశ్వరరావుతో పాటు జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ ఎన్నికల హామీలలో భాగంగా కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికి అధికారంలోకి వచ్చి పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములు, దేవాలయ భూములు ఆక్రమించుకున్నప్పటికీ ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నాయకులు సుంకయ్య, ప్రసాద్, సోమన్న, లక్ష్మీదేవి, సుశీలమ్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలపై నిరంతర పోరాటం'

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): చేతి వృత్తిదారుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు చెప్పారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో చేతి వృత్తిదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని రజకులు, గొర్రెల పెంపకం దారులు చేపట్టనున్న చేపట్టనున్న రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు వెన్నుదన్నుగా నిలిచి పోరాడతామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, చేతి వృత్తి దారులు జిల్లా కార్యదర్శి రామ్మోహన్, జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దీన్ పాల్గొన్నారు.

పీ-4 విధానం అమలుకు చర్యలు

● రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

● ఎంఎస్ఎంఈ సర్వేను పూర్తి చేయండి: కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే ఉగాది నుంచి పీ-4(పబ్లిక్-ప్రైవేట్-పీపుల్స్-పార్టనర్‌షిప్) విధానం అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ వెల్లడించారు. గురువారం అమరావతి నుంచి పీ-4 విధానంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ రాజకుమారి, డీఆర్వో రామునాయక్, తదితర జిల్లా అధికారులు హాజరయ్యారు. సీఎస్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ-4 విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ సున్నా పేదరికం- పీ4 విధానం, నియోజకవర్గ అభివృద్ధి విజన్ ప్రణాళికల తయారీ కోసం నోడల్ అధికారులను నియమించాలని సీపీను ఆదేశించారు. పట్టణ ప్రాంతాలలో ఎంఎస్ఎంఈ సర్వే ప్రక్రియ అధిక స్థాయిలో పెండింగ్ ఉందని, మున్సిపల్ కమిషనర్లు ఎంపీడీవోలు సర్వేని వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రగతి కనబరచని మున్సిపల్ కమిషనర్లకు, ఎంపీడీవోలకు, ఎంఎస్ఎంఈకి సంబంధించి 650 మంది ఇంకా లాగిన్ కాలేదని, సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులను జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటు కోసం భూములను గుర్తించాలని ఆర్డీవోలకు సూచించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: ఎస్డీపీవో



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్డీపీవో జావలి ఆల్ఫోన్స్

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నంద్యాల ఎస్డీపీవో జావలి ఆల్ఫోన్స్ సూచించారు. డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా డీవైఎఫ్ఐ నాయకులు శివ, మధుశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌డీపీవో జావలి మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా మంచి భవిష్యత్ వైపు అడుగులు వేయాలని సూచించారు. దేశ ఔన్నత్యాన్ని నిలబెట్టగల సామర్థ్యాలు యువతలో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా పోస్టరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాయి, మార్క్స్, స్టీవెన్ పాల్గొన్నారు.

9 నుంచి కొలను భారతి క్షేత్రంలో భీష్మ ఏకాదశి పూజలు

● అమ్మవారిని దర్శించుకున్న శివయోగేంద్ర సరస్వతి స్వామీజీ

కొత్తపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కొలనుభారతి పుణ్యక్షేత్రంలో ఈ నెల 9, 10 తేదీల్లో 66వ భీష్మ ఏకాదశి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు కాకనూరు శారద మఠం పీఠాధిపతి శివ యోగేంద్ర సరస్వతి స్వామీజీ తెలిపారు. గురువారం స్వామీజీ కొలనుభారతి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం రెండు రోజుల పాటు కొలనుభారతిలో జరిగే భీష్మ ఏకాదశి పూజల ఏర్పాట్లపై అక్కడి పురోహితులతో చర్చించారు. 66వ భీష్మ ఏకాదశి పూజలు సద్గురు సరస్వతి నారాయణ స్వామి ఆశీస్సులతో నిర్వహిస్తున్నట్లు స్వామీజీ తెలిపారు.

'మార్చి నెలాఖరులోపు రుణాలు చెల్లించాలి'

కొత్తపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): 2023 డిసెంబరు 31కి ముందు మొండి బకాయిలుగా మారిన వ్యవసాయ రుణాలను ఈ ఏడాది మార్చి 31లోపు చెల్లిస్తే వన్‌టైం సెటిల్మెంట్ కింద పరిష్కరిస్తామని కొత్తపల్లి స్టేట్ బ్యాంకు మేనేజర్ పవన్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక స్టేట్ బ్యాంకులో మేనేజర్ పవన్‌కుమార్‌తో పాటు ఫీల్డ్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య, క్యాష్ ఆఫీసర్ రాజశేఖర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. కొత్తపల్లి స్టేట్ బ్యాంకులో గత కొన్ని సంవత్సరాలుగా 283 మంది రైతులు రూ.1.36 కోట్ల వ్యవసాయ రుణాలు తీసుకుని నేటికి చెల్లించకపోవడంతో మొండిబకాయిలుగా మారినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ఏడాది మార్చి 31లోపు వన్‌టైమ్ సెటిల్మెంట్ చేసుకుంటే వారి బకాయిని బట్టి 15 శాతం నుంచి 70 శాతం వరకు రాయితీ కల్పిస్తామన్నారు. రుణవిముక్తులైన రైతులకు తిరిగి మళ్లీ రెండు నెలల తర్వాత వ్యవసాయ రుణాలు ఇస్తామని చెప్పారు.

'మూడు రోజుల పాటు తాగునీటి సరఫరాలో అంతరాయం'

నందికొట్కూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద ఒక మోటరు మరమ్మత్తుకు గురి కావడంతో పట్టణంలోని పలు కాలనీల్లో మూడు రోజుల పాటు మంచినీరు రావని మున్సిపల్ కమీషనర్ బేబి ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రధాన నీటి సరఫరా వనరులైన మల్యాల వాటర్ వర్క్స్ నుంచి రెండు మోటార్ల ద్వారా వివిధ ట్యాంకులకు పంపింగ్ చేస్తున్నారు. అయితే ప్రస్తుతం మల్యాల పంప్ హౌస్‌లో ఒక్క మోటారు మరమ్మత్తుకు గురైందని దీంతో మూడు రోజుల పాటు పట్టణంలోని ఏబీఎం పాలెం, ఇందిరా నగర్, మద్దిగట్ల పేట, వినాయకుని గుడి లైన్, షికారి పేట, ఎస్ఎస్ఆర్ నగర్‌లలో మంచినీరు సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

ఆర్డీవోకు సన్మానం



ఆర్డీవోను సన్మానిస్తున్న ఇజితెమా కమిటీ సభ్యులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో ఫిబ్రవరి 7,8,9 తేదీల్లో జరిగిన ఉమూమి తబ్లిగీ ఇజితెమా విజయవంతం కావడం పట్ల ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతిని ఇజితెమా కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఇజితెమా కమిటీ సభ్యులు హబీబుల్లా, నూర్‌బేగ్, ఇషాక్, షాలీపైల్వాన్, గౌసలాజం, అబ్దుల్లా, ఆనస్ తదితరులు ఉన్నారు.

శ్రీశైలంలో పారిశుధ్య పనులు

శ్రీశైలం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం పరిధిలో వారంలో ప్రతి గురువారం పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించేందుకు దేవస్థానం శ్రీకారం చుట్టింది. ఇందులో బాగంగా గురువారం ఈవో ఎం.శ్రీనివాసరావు, అధికారులు సిబ్బంది ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రసాద విక్రయ కేంద్రాలు, మాడవీధులు, క్యూ కాంప్లెక్స్, సాక్షిగణపతి, హాటకేశ్వరం, శిఖరేశ్వరం ఆలయాల వద్ద పారిశుధ్య పనులు చేపట్టారు.

పార్వేట పల్లకికి విశేష పూజలు



ఆళ్లగడ్డలో పార్వేట పల్లకికి పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు భార్గవ్‌రామ్, భూమా విఖ్యాత్‌రెడ్డి



జ్వాలా, ప్రహ్లాద వరద స్వామి ఉత్సవమూర్తులకు హారతి ఇస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : అహోబిలం లక్ష్మీనృసింహస్వామి పార్వేట పల్లకికి ఆళ్లగడ్డ ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. జ్వాలా, ప్రహ్లాదవరదస్వామి ఉత్సవమూర్తులు కొలువైన పల్లకి గురువారం సాయంత్రం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ నివాసం వద్దకు చేరుకుంది. టీడీపీ సీనియర్ నాయకుడు భార్గవ్ రామ్, యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, కుటుంబసభ్యులు అహోబిలేశుడికి విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు, మంగళహారతి నిర్వహించి ఆశీర్వచనం చేసి వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటి వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

గోవిందపల్లెలో శ్రీరామ జపయజ్ఞ సప్తాహం

శిరివెళ్ల: మండలంలోని గోవిందపల్లె సీతా రామాంజనేయస్వామి దేవస్థానంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో మార్చి 17 నుంచి 24వ తేదీ వరకు అఖండ శ్రీరామ జయరామ నామ జపయజ్ఞ సప్తాహం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గోవిందపల్లెలోని గోవిందానంద ఆశ్రమంలో విశ్వహిందూపరిషత్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు వైవీ రామయ్య, కార్యదర్శి కిషోర్ కుమార్ గురువారం కరపత్రాలను విడుదల చేశారు. జపయజ్ఞ సప్తాహంలో భాగంగా 22న భగవత్ గీతా ప్రచారకులు రాధా మనోహర్ దాసు, 23న పద్మశ్రీ సహస్రావధాని, సాగరఘోష కవి డాక్టర్ గరికపాటి నరసింహా రావు, 24న కాకనూరు శారదాపీఠం శివయోగేంద్ర సరస్వతి స్వాముల ప్రవచన సందేశాలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో భజరంగదళ్ నంద్యాల జిల్లా సంయోజక్ భోగిరెడ్డి నాగిరెడ్డి, సహ సంయోజక్ కమతం రాజశేఖర్‌రెడ్డి, కాశయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

చేపల వేలం వాయిదా

డోన్ రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉడుములపాడు గ్రామంలో గురువారం చేపట్టిన చేపల వేలం పాట వాయిదా పడింది. ఉడుములపాడు గ్రామం సమీపంలో ఉన్న చెరువులో చేపలు పట్టుకునేందుకు రైతుభరోసా కేంద్రంలో ఈవోఆర్‌డీ డి.ఫకృద్దీన్ సాహెబ్ వేలం పాట నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన వేలం పాట ధర రూ.2 లక్షలకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఈవోఆర్‌డీ తెలిపారు. తిరిగి వేలం పాట నిర్వహించే తేదీని నిర్ణయించి ప్రకటిస్తామని చెప్పారు. సమావేశంలో సర్పంచ్ యు.రాధమ్మ, ఎంపీటీసీ, సచివాలయ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తులకు గడువు పొడిగింపు

డోన్ రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గీతా కార్మికులు మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం గడువు పొడిగించిందని ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో కొత్తగా కేటాయించిన 11 మద్యం షాపులకు 42 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తులు తక్కువ రావడంతో ఈ నెల 5వ తేదీ వరకు ఉన్న గడువును రాష్ట్ర ప్రభుత్వం 8వ తేదీ వరకు పెంచుతూ నిర్ణయం తీసుకుందన్నారు. ఆసక్తిగల గీతా కార్మికులు ఎక్సైజ్ స్టేషన్‌లో మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచాలి

చాగలమర్రి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని ఎంఈవో న్యామతుల్ల ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని నేలంపాడులోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ తప్పనిసరిగా పాటించాలని అన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో గేదెలు, దూడల్లో వచ్చే గొంతువాపు వ్యాధి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి సాయిబాబా అన్నారు. గొంతువాపు వ్యాధితో గేదెలు, దూడలు మృతి అన్న శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. స్పందించిన పశువైద్యాధికారి, వైద్య సిబ్బంది కలిసి గ్రామంలోని పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేశారు.

జాతీయ స్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక

రుద్రవరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం ఆదర్శ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు గురువారం ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు తెలిపారు. రాష్ట్ర స్థాయి జంప్ రోప్ పోటీల్లో స్పందన, రాజేశ్వరి, నర్మద, వర్షితలు సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 11న మహారాష్ట్రలోని నాశిక్‌లో జరగబోయే జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ శ్రీనివాసులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంటుపై విచారణ

రుద్రవరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిత్రేణిపల్లె గ్రామంలో గురువారం ఫీల్డ్ అసిస్టెంటు సుందర్‌పై ఏపీడీ సాంబశివరావు గ్రామస్థులను విచారించారు. గ్రామంలో ఉపాధి పనులు చూపించడంలో వివక్ష, బంధువులకు మస్టర్లు వేస్తున్నారని ఫిర్యాదు చేయడంతో ఇంకా పలు రకాల అంశాలపై ఫిర్యాదు చేయడంతో ఏపీడీ విచారించినట్లు ఏపీవో ప్రతాప్ తెలిపారు. గ్రామంలో ఉపాధి పనులను కూలీలను గ్రామస్థులను విచారించారన్నారు. విచారణ నివేదిక ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శివక్రిష్ణ తదితరులు ఉన్నారు.

సర్వే సమస్యలపై అవగాహన

రుద్రవరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం మండలంలో సర్వేపై వచ్చిన దరఖాస్తులను, రీసర్వేలో జరిగిన తప్పిదాలపై సర్వే ఏడీ జయరాజ్, రీజనల్ డిప్యూటీ సర్వేయర్ వెంకటచెన్నయ్యలు పలు సూచనలు చేశారు. గురువారం రుద్రవరంలోని తహసీల్దారు కార్యాలయంలో విలేజీ సర్వేయర్లు, వీఆర్వోలకు దరఖాస్తులు పరిష్కరించేందుకు పరిష్కరించడం ఎలానో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు వెంకటశేఖరయ్య తదితరులు ఉన్నారు.

క్రమ శిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణ, పట్టుదల ఉన్నత శిఖరాలకు చేరుస్తాయని కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు అన్నారు. గురువారం స్థానిక మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు వివిధ అంశాలపై మండల స్థాయి పోటీ పరీక్షలు నిర్వహించారు. 220 మంది విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సీఐ రమేష్‌బాబు విలువైన ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కన్సోలేషన్ బహుమతులు అందించడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, చంద్రహాసన్‌రెడ్డి, గురప్ప, వైవీఎస్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

మాలల యుద్ధ గర్జనకు తరలి రండి

సంజామల, ఫిబ్రవరి 6: కర్నూలులో ఈ నెల 23న జరిగే రాయలసీమ మాలల యుద్ధ గర్జనకు తరలి రావాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కేడం సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రాయలసీమ మాలల యుద్ధగర్జన పోస్టర్లను ఆయన విడుదల చేశారు.

ఏపీఎం, సీసీని తొలగించాలి : సీఐటీయూ

బేతంచెర్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురం, వీవోఏ లక్ష్మీదేవి ఆత్మహత్యాయత్నానికి కారకులైన ఏపీఎం, సీసీని తక్షణమే సస్పెండ్ చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు వై.ఎల్లయ్య డీవైఎఫ్ఐ నాయకులు మధుశేఖర్ మాట్లాడుతూ వీవోఏ లక్ష్మీదేవి ఆత్మహత్యాయత్నానికి కారకులైన ఏపీఎం, సీసీలను అరెస్టు చేసి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ, మద్దిలేటి స్వామి, శ్రీనివాసులు, హరిప్రసాద్, మధు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి నిధులు కేటాయించాలి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగానికి కేంద్ర బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, సీఐటీయూ జిల్లా నాయకుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, బడ్జెట్‌లో కోతలను నిరసిస్తూ ఆళ్లగడ్డ పట్టణంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను గురువారం దహనం చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 రకాల కార్మిక చట్టాలను రద్దు చేస్తూ వాటి స్థానంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులకు తీవ్ర నష్టం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

శిరివెళ్ల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిపై కానాలపల్లె మెట్ట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. తెలంగాణ రాష్ట్రం అంకిరావు పల్లెకు చెందిన నవీన్ చాగలమర్రి మండలం మల్లెవేముల గ్రామంలో వివాహం చేసుకున్నాడు. ఈ నెల 5వ తేదీన మల్లెవేముల నుంచి నంద్యాలకు బైక్‌పై వెళ్తుండగా ఓ లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన నవీన్(29) నంద్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపారు.

● శిరివెళ్ల ఎస్సీ కాలనీ శివార్లలో వక్కిలేరు వాగు సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ చిన్న పీరయ్య గురువారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.16,200 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం

ప్యాపిలి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్త ఇబ్రహీంకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావు యాదవ్ రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. గురువారం గుత్తిలో వైద్యం తీసుకుంటున్న ఇబ్రహీంకు టీడీపీ నాయకుడు మహేష్‌యాదవ్ ద్వారా ఈ మొత్తాన్ని అందజేశారు. ఆర్థిక సాయం అందజేయడంపై ఇబ్రహీం కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

చిట్యాలలో నాటు సారా బట్టీలు ధ్వంసం

క్రిష్ణగిరి, ఫిబ్రవరి 6: మండలంలోని చిట్యాల గ్రామ సమీపంలోని వంకలో అక్రమంగా నిర్వహిస్తున్న నాటు సారా బట్టీలను గురువారం ఎక్సైజ్ పోలీస్‌లు ధ్వంసం చేశారు. సీఐ మంజుల ఆదేశాల మేరకు ఎస్సై చంద్రమోహన్ సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడులలో నాటు సారా తయారీకి సిద్ధంగా ఉన్న 4 డ్రమ్ములలోని 2200 లీటర్ల వాష్‌ను, నాటు సారా తయారీ డ్రమ్ములను ధ్వంసం చేశారు. ఎక్సైజ్ అదికారుల దాడులతో నాటు సారా తయారీదారులు పారిపోయారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మీర్జాపురంలో మేకల అపహరణ

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్జాపురం గ్రామంలో బుధవారం అర్ధరాత్రి రెండు మేకలు అపహరణకు గురయ్యాయి. గ్రామంలోని కొత్త రూములు కాలనీలో నివశించే నర్శిపల్లె కంబయ్య రెండు మేకపోతులను పెంచుకుంటున్నారు. బుధవారం ఆసుపత్రి పని నిమిత్తం కంబయ్య కుటుంబ సభ్యులతో కలిసి ఊరికి వెళ్లారు. దీంతో బుధవారం రాత్రి బంధువులు రెండు మేకలను కంబయ్య ఇంటిలో ఉంచి గొళ్లెం పెట్టారు. గురువారం ఉదయం వచ్చి చూడగా గుర్తు తెలియని దుండుగలు మేకలను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు వాపోయాడు. వీటి విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని అన్నారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి భజన పోటీలు

ప్యాపిలి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఆర్‌పల్లి సమీపంలోని ప్రసిద్ధ పంచలింగేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం నుంచి రాష్ట్ర స్థాయి భజన పోటీలు నిర్వహించనునున్నట్లు గురువారం నిర్వాహకులు తెలిపారు. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే భజన బృందాలు ఈ నెల 7వ తేదిలోపు రూ.300 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవలసిందిగా వారు కోరారు.

అనాథ వృద్ధులకు పింఛన్ల పంపిణీ

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల పట్టణంలో 15 ఏళ్లుగా అనాథ వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు రిటైర్డ్ లైబ్రేరియన్ నరసింహారెడ్డి తెలిపారు. 2011వ సంవత్సరంలో ప్రకృతి పీఠం స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి అనాథ వృద్ధులు, వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం కోవెలకుంట్ల పట్టణంలో 150 మందికి ఒక్కొక్కరికి రూ.100 చొప్పున పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమానికి దాతలు అందిస్తున్న సహకరాం మరువలేనిదన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

బేతంచెర్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల మండల పరిధిలోని అంబాపురం గ్రామంలో రైతు సేవా కేంద్రం వద్ద కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయాధికారి కిరణ్ కుమార్ గురువారం తెలిపారు. ఈ కొనుగోలు కేంద్రాన్ని ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో డోన్ డీసీఎంఎస్ నిర్వహకులు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ నిర్వహకులు అవినాశ్ రెడ్డి, వీహెచ్ఏ సుదాకర్ రెడడ్డి, ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అధిక నిధులు కేటాయించాలి

డోన్ రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన వాల్మీకుల అభివృద్ధి కోసం బీసీ కార్పొరేషన్‌లో వాల్మీకులకు అధిక నిధులు కేటాయించాలని రాష్ట్ర వాల్మీకి డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వలసల రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం విజయవాడలోని బీసీ భవన్‌లో జరిగిన బీసీ కార్పొరేషన్ ప్రతినిధుల సమావేశంలో వలసల రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా వచ్చిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, చీఫ్ సెక్రటరీ సత్యనారాయణలకు ఈ సందర్భంగా వలసల రామకృష్ణ కలిసి వినతి పత్రం అందజేశారు.

రూ.1.15 లక్షల విరాళం

డోన్ రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ హైవే సమీపంలో ప్రారంభానికి సిద్ధమవుతున్న షిరిడీ సాయిబాబా మందిరానికి కోట్లవారిపల్లె పౌడర్ ఫ్యాక్టరీ అసోసియేసన్ సభ్యులు, వనరులు చంద్రశేఖర్ రెడ్డి, చల్లా సుబ్బారెడ్డి, మిట్టా రవి, చెన్నయ్య, రఘు, ధర్మవరం రఘు, అనుముల సుబ్బారెడ్డి, అన్వర్‌లు కలిపి రూ.1.15 లక్షల విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. గురువారం రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి చేతుల మీదుగా ఈ విరాళ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సీఎం శ్రీనివాసులు, పార్థసారధి, కొండా సురేష్, ఆలా మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశం ఏర్పాటుకు ఆదేశాలు ఇవ్వాలి

డోన్ టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): డోన్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి ఆదేశాలు ఇవ్వాలని సీపీఐ మున్సిపల్ కౌన్సిలర్ సుంకయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడులు గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నంద్యాల జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోన్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం 2024లో జరిగిందని, దాదాపు మూడు నెలలు పైగా అయినప్పటికీ కౌన్సిల్ సమావేశం జరగలేదని, వెంటనే కౌన్సిల్ సమావేశం ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసేవిధగా చర్యలు తీసుకోవాలని కోరారు.

1,400 టన్నుల బియ్యం సీజ్

బనగానపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె-నంద్యాల రహదారిలోని ఎంఎస్ఎం ఎక్స్‌పోర్టు ప్రైవేటు లిమిటెడ్ పేరుతో రేషన్ బియ్యం పాలిష్ చేసి అమ్ముతున్నట్లు ఫిర్యాదు రావడంతో దాడి చేసి సదరు ఎంఎస్ఎం గదిని, 1,400 టన్నుల బియ్యాన్ని సీజ్ చేసినట్లు తహసీల్దారు నారాయణరెడ్డి గురువారం తెలిపారు. ఎంఎస్ఎం ఎక్స్‌పోర్టు లిమిటెడ్ పేరుతో ఓ గదిని అద్దెకు తీసుకొని రేషన్ బియ్యం పాలిష్ చేసి అమ్ముతున్నట్లు ఫిర్యాదు అందినట్లు తహసీల్దారు తెలిపారు. బియ్యంను స్వాధీనం చేసుకొని ఉన్నతాధికారులకు టెస్టింగ్ కోసం పంపినట్లు తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణే లక్ష్యం

అవుకు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణే లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిరణ్‌బాబు అన్నారు. గురువారం గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రాస్ ప్రోగ్రామ్‌లో భాగంగా టీడీపీ నాయకుడు గుర్రప్పతో కలసి వేములపాడు గ్రామంలో చేతి పంపులకు మరమ్మతులు చేయించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

డోన్ రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉల్లి పంటలో నీటి యాజమాన్య పద్ధతులను పాటించాలని డోన్ ఉద్యానశాఖ అధికారిణి కళ్యాణి రైతులకు సూచించారు. గురువారం మండలంలోని కొచ్చెర్వు గ్రామంలో ఉల్లి రైతులకు ఆమె శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులను ఏ విధంగా వాడాలి.. తెగుళ్లను ఎలా నివారించాలి.. వాటికి తీసుకోవాల్సిన సస్యరక్షణ వంటి పద్ధతులపై రైతులకు శిక్షణలో వివరించారు.

అత్యాచార యత్నం కేసు నమోదు

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఓ గ్రామంలో బాలికపై అదే గ్రామానికి చెందిన వృద్ధుడు అత్యాచారయత్నానికి పాల్పడడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ హనుమంతనాయక్ తెలిపారు. బాలిక పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో వృద్ధుడు ఆ బాలికను రూములోకి తీసుకెళ్లి అత్యాచార యత్నం చేశాడు. బాలిక అక్కడ నుంచి తప్పించుకుని ఇంటికి వచ్చింది. సాయంత్రం పొలం నుండి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు జరిగిన విషయం తెలిపింది. తల్లిదండ్రులు రేవనూరు పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

బనగానపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని కొండపేటలోని చింతమాను మఠం సమీపంలో గత సంవత్సరం అక్టోబరులో జరిగిన దొంగతనం కేసులో ఇల్లూరుకొత్తపేటకు చెందిన మనోహర్ అను దొంగను అరెస్టు చేసినట్లు బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ గురువారం తెలిపారు. బంగారు, వెండిని స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

శ్మశాన వాటిక రస్తా సమస్యను పరిష్కరించాలి

సంజామల, ఫిబ్రవరి 6: పేరుసోమలలో ఎస్సీ శ్మశాన వాటిక రస్తాను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి మిద్దె వెంకటరాముడు, మండల అధ్యక్షులు కంబగిరి రాముడు గురువారం తహసీల్దార్ అనిల్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని పెత్తందార్లు ఎస్సీల శ్మశాన వాటిక దారికి మూసేసే ప్రయత్నాలు చేస్తున్నారని వివరించారు.

పాడి రైతు దేశానికి వెన్నెముక



రైతుకు బహుమతి అందిస్తున్న జేడీ గోవిందనాయక్

రుద్రవరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పాడి రైతు దేశానికి వెన్నెముక లాంటివారని పశు సంవర్ధకశాఖ జేడీ గోవిందనాయక్ అన్నారు. గురువారం మండలంలోని ఎర్రగుడిదిన్నె గ్రామంలో రాష్ట్రీయ గోకుల్‌మిషన్ కార్యక్రమంలో భాగంగా లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. జేడీ మాట్లాడుతూ ఒక పాడి ఎకరా భూమితో సమానమని అన్నారు. లేగదూడల పెంపకంలో ప్రతిభ కనబరిచిన రైతులకు బహుమతులు ప్రదానం చేశారు. లేగదూడల్లో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, పోషణ వాటిల్లో వచ్చే వ్యాధులు గురించి సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాగ్యలక్ష్మి, కర్నూలు జిల్ల పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు రాజశేఖర్, డీడీ వెంకటరమణయ్య ఏడీఏలు వరప్రసాద్, కొండారెడ్డి, గిడ్డయ్య, పశువైద్యాధికారులు మనోరంజన్‌ప్రతాప్, చంద్రమోహన్, బాలాజీ నాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాటర్ గ్రిడ్ పనుల్లో జాప్యం వద్దు



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి

బేతంచెర్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వాటర్ గ్రిడ్ పనుల్లో జాప్యం చేస్తే సహించేది లేదని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నియోజకవర్గ స్థాయిలో ప్రజల తాగునీటిపై అధికారులతో పాటు మెగా కంపెనీ వాటర్ గ్రిడ్ ఇంజనీర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. పైపులైన్లు త్వరితగతిన పూర్తి చేసి ప్రతి పల్లెకు తాగునీరు మార్చి నాటికి అందించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో వాటర్ గ్రిడ్ ఇంజనీర్లు, డోన్ ఆర్డీవో నరసింహులు, ఆయా మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ రమేష్‌బాబు పాల్గొన్నారు.

పొలాలకు వెళ్లేందుకు దారి చూపాలి

బేతంచెర్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో ఎన్‌హెచ్-340 బీ రోడ్డుకు తూర్పు వైపు ఉన్న పంట పొలాలకు రహదారి ఇప్పించాలని రైతులు, ఆ గ్రామ ప్రజలు గురువారం రోడ్డుపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం రంగాపురం గ్రామంలో నేషనల్ హైవే పనులు జరుగుతుండడంతో ముచ్చట్ల మల్లికార్జున స్వామి దేవాలయం వెళ్లే తూర్పు రస్తాలో రోడ్డుకిరువైపులా మూసి వేస్తున్నారని అన్నారు. దీంతో రైతులు పొలాలకు కిలోమీటరు మేర తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు.ప్రభుత్వం అక్కడ వారు సర్కిల్ ఏర్పాటు పొలాలకు వెళ్లే రస్తా కల్పించాలని కోరారు. అనంతరం వినతి పత్రాన్ని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి అందజేశారు.

వినియోగదారుడే ఉత్పత్తిదారుడు

చాగలమర్రి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన ద్వార గృహ వినియోగదారుడు విద్యుత్ ఉత్పత్తిదారుడిగా మారే అవకాశం కలుగుతుందని ఆళ్లగడ్డ విద్యుత్ శాఖ ఏడీఈ రవికాంత్‌చౌదరి అన్నారు. గురువారం చాగలమర్రి విద్యుత్ కేంద్రంలో విద్యుత్ సిబ్బందికి ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాయితీతో సౌర విద్యుత్ సులభతరం చేసిందని అన్నారు. ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. విద్యుత్ బకాయిలు సకాలంలో వసూలు చేయాలని అన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఏఈ రమణయ్య, లైన్‌ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

చాగలమర్రి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ ఉపాధి సిబ్బందికి ఆదేశించారు. గురువారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో టీఏలు, ఎఫ్ఏలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్చి చివరి నాటికి ఉపాధి పనుల లక్ష్యాన్ని పూర్తి చేయాలని అన్నారు. 12 గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయని, అన్ని గ్రామాల్లో పనులు జరిగేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీవో నిర్మల ఉన్నారు.

కందులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

చాగలమర్రి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు పండించిన కందులు విక్రయించేందుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో రంగనేతాజీ తెలిపారు. గురువారం చాగలమర్రి ఆర్‌బీకే కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరతో కందులు కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.7,550 నిర్ణయించినట్లు తెలిపారు. గ్రామాల్లోని రైతులు ఆర్‌బీకేల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో మంజుల, వీఏఏ సుబ్బరాయుడు ఉన్నారు.

పేదలకు అండగా ఉంటాం: సీపీఐ

డోన్ టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సమస్యలు తీర్చేందుకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి మోట రాముడు అన్నారు. గురువారం పట్టణంలోని సుందర్‌సింగ్ కాలనీలో పేద ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటాలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, రామ్మోహన్, లక్ష్మీదేవి, మాధవి పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ వాడాలి

డోన్ టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ వాడడం వల్ల ప్రమాదాల్లో తలకు గాయాలు కాకుండా రక్షణ వలయంగా ఉంటుందని ఆర్టీవో క్రాంతి కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్, కార్ల డ్రైవర్లు సీటు బెల్టు తప్పనిసరిగా వినియోగించి ప్రాణాలను కాపాడుకోవాలన్నారు.

నీటి సమస్య రాకుండా చర్యలు

డోన్ టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రజలకు తాగు నీటి సమస్య రానివ్వబోమని మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. గురువారం పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతుండడంతో మరమ్మతులు చేయించినట్లు ఆయన తెలిపారు. పట్టణ ప్రజలకు లేకుండా రోజు విడిచి రోజు నీరు విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రజలు సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ జాకీర్ హుశేన్, సిబ్బంది ఉన్నారు.

మట్టి మిద్దె కూలి ఎద్దులకు గాయాలు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోటపాడు గ్రామంలో బుధవారం అర్ధరాత్రి మట్టి మిద్దె కూలి రెండు ఎద్దులకు గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన మర్రిబోయిన వెంకటేశ్వర్లు మట్టి మిద్దెలో నివాసం ఉంటున్నాడు. బుధవారం రాత్రి అదే ఇంటిలో ఎద్దులు కట్టేసి బయట పడుకొని నిద్రిస్తున్నాడు. అర్ధరాత్రి మిద్దె కూలడంతో రెండు ఇద్దులకు గాయాలయ్యాయి. వీఆర్వో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.